విధేయతకు ప్రాధాన్యం

కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి

ఎంపిక చేసిన అధిష్ఠానం

పట్టాభిపురం, న్యూస్‌టుడే

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తెదేపా సీనియర్‌నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆలపాటిని ఎంపిక చేసినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. మేలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆలపాటి రాజా తెనాలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాల్సి ఉంది. పొత్తుల్లో భాగంగా ఆ సీటును జనసేనకు కేటాయించారు. అధినాయకత్వం ఆదేశాల మేరకు జీవీఎల జరిగిన ఎన్నికల్లో ఆయన అభ్యర్థి విజయానికి కృషి చేశారు. ఈ క్రమంలో గతంలో వాగ్దానం మేరకు అధిష్ఠానం ఆలపాటి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. అధినాయకత్వం ఆదేశాలను అనుగుణంగా నడుచుకోవడం, విధేయతగా ఉండటం, సీనియర్ నేత కావడం తదితర అంశాలు రాజా వైపే మొగ్గు చూపేందుకు దోహదపడ్డాయి.



ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఎలక్షన్ ఏజెంట్‌గా సేవలందించారు. 1994, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో వేమూరు నుంచి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆలపాటి ధర్మారావుపై విజయం సాధించారు. 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999లో రెండోసారి గెలుపొందిన తర్వాత చంద్రబాబు మంత్రి వర్గంలో సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా రెండున్నరేళ్లపాటు సేవలందించారు. 2004, 2009 ఎన్నికల్లో విజయం సాధించలేకపోయారు. 2014లో తెనాలి నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2019లో ఓటమి పాలయ్యారు.

ప్రభుత్వ మంచి పనులే గెలిపిస్తాయి

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించి అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఆలపాటి రాజా ధన్యవాదాలు తెలిపారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో 33 నియోజకవర్గాలోని ఎమ్మెల్యేలు, ఎంపీల సహాయ సహకారాలు, సమష్టి కృషితో ఎన్నికల్లో విజయం సాధిస్తానన్నారు. రెండు జిల్లాలు రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైనవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనతి కాలంలోనే ఎన్నో మంచి పనులు చేపట్టిందన్నారు. అవే నా విజయానికి దోహదపడతాయని ఆలపాటి పేర్కొన్నారు.

తెలుగు యువత అధ్యక్షుడిగా ప్రస్థానం..

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆలపాటి రాజా పార్టీలో ఏదోఒక రూపంలో సేవలు అందిస్తున్నారు. ఎన్టీఆర్ తెదేపాను స్థాపించిన సమయానికి ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆలపాటి అప్పట్లో లీగల్‌సెల్ సభ్యులుగా పని చేశారు. 1989-90 వరకు గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. గుంటూరు ఎంపీగా పోటీ చేసిన లాలాజాన్‌బాషాకు చీఫ్

రైతులకు పురస్కారం

గన్నవరం గ్రామీణం: కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆదివారం రైతునేస్తం మాసపత్రిక 20వ వార్షికోత్సవం, రైతులకు పురస్కారాల ప్రదానం ఘనంగా నిర్వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఏపీ రైతు సాధికారసంస్థ వైస్‌ఛైర్మన్ టి.విజయకుమార్, రైతునేస్తం ఎడిటర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, స్వర్ణభారత్ ట్రస్టు ఛైర్మన్, ఖైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నాగలితో వెంకయ్యనాయుడు, పక్కన యడ్లపల్లి వెంకటేశ్వరరావు

గుంటూరులో నేడు ట్రాఫిక్ మళ్లింపు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంపాలెంలోని అమరవీరుల స్తూపం వద్ద ఈనెల 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి కార్యక్రమం ముగిసేవరకు ఇది అమలులో ఉంటుందన్నారు. పట్టాభిపురం కంకరగుంట పైవంతెన నుంచి వచ్చే వాహనాలు ఎంటీబీ కూడలి వైపు వెళ్లేవారు కలెక్టరేట్ జంక్షన్ వద్ద కుడివైపునకు తిరిగి కలెక్టర్ బంగ్లా, మెడికల్ క్లబ్ మీదగా ప్రయాణించాలన్నారు. శంకర్‌విలాస్ బ్రిడ్జి కింద నుంచి, రైల్వేస్టేషన్ నుంచి వచ్చే వాహనదారులు అంకమ్మతల్లి గుడి వద్ద ఎడమ వైపు తిరిగి కన్నావారితోట వైఎస్ఆర్ బొమ్మ వద్ద నుంచి ఎంటీబీ వైపు వెళ్లాలన్నారు. కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పోలీసు కవాతుమైదానం ఎదురుగా ఉన్న గేటు నంబర్ 2 ద్వారా రాకపోకలు సాగించాలన్నారు. ఐటీసీ నుంచి నగరంపాలెం పోలీసుస్టేషన్ మీదగా వచ్చే వాహనదారులు కలెక్టరేట్ రోడ్డు, పట్టాభిపురం పైవంతెన వీదగా వెళ్లాలన్నారు.

విజిలెన్స్ విచారణతో.. హడల్!

- పూర్తిస్థాయిలో దస్త్రాలు ఇచ్చేందుకు మీనమేషాలు
- నాడు ముడుపులు దండుకుని ప్రస్తుతం విలవిల
- అనుకూలంగా చెప్పాలని అధ్యాపకులకు వేడుకోలు
- ఏఎన్‌యూ ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశం

ఈనాడు-అమరావతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత ఐదేళ్లలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా దూర విద్య, పీజీ పరీక్షలు, సీడీసీ తదితర అకడమిక్ విభాగాలతో పాటు ఇంజినీరింగ్ విభాగం పనుల్లో అవినీతి పెద్దఎత్తున జరిగింది. ఆయా విభాగాల్లో ఉన్నతాధికారులుగా పనిచేసిన వారిలో కొందరు బాగానే వెనకేసుకుని ప్రస్తుతం విజిలెన్స్ విచారణ అనే సరికి కకావికలమవుతున్నారు. రూ.కోట్ల విలువైన పనులను సైతం ఎలాంటి టెండర్లు లేకుండా నామినేషన్లపై కట్టబెట్టి గుత్తేదారుల నుంచి ఇంజినీరింగ్ అధికారులు, వర్సిటీ పెద్దలు, ఫైనాన్స్ అధికారులు కమీషన్ల రూపేణా భారీగా లబ్ధి పొందారు. ఈ వ్యవహారాలపై 'ఈనాడు'లో వచ్చిన వరుస కథనాలకు స్పందించి ఇప్పటికే ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో జిల్లా విజిలెన్స్ అధికారులు ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన పనుల వివరాలను అందజేయాలని వర్సిటీ ఇంజినీర్‌ను కోరగా కొన్ని వివరాలు మాత్రమే ఇచ్చి..మరికొన్నింటిని పంపలేదు. 2019-24 మధ్య చేపట్టిన పనుల టెండర్లు, నామినేషన్లపై చేసిన ప్రతి ఒక్క అంచనా వివరాలు, బిల్లులకు సిఫార్సు చేసిన క్వాలిటీ కంట్రోల్ నివేదికలను అందజేయాలని తాజాగా విజిలెన్స్ ఎస్పీ వర్సిటీ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. అయితే పూర్తి స్థాయిలో రికార్డులు ఇవ్వడానికి తర్జనభర్జన పడుతున్నారు. దస్త్రాలే ఇవ్వడం లేదంటే ఏదో మతలబు ఉండొచ్చని విజిలెన్స్ అధికారులు అనుమానిస్తున్నారు.



వైకాపాకు గులాంగిరీ చేసి..

వైకాపా హయాంలో వర్సిటీ పరిపాలనా పదవుల్లో పనిచేసిన వారు దీనిని అక్రమాలకు నిలయంగా మార్చేశారనే విమర్శలను మూటగట్టుకున్నారు. వైకాపా హయాంలో కొందరు అధ్యాపకులు నాటి ప్రభుత్వ పెద్దల పంచన చేరారు. వారంతా ఇప్పుడు హడలిపోతున్నారు. గత పాలకులు వర్సిటీకి చెందిన సుమారు రూ.60-70 కోట్ల నిధులను కరిగించేశారని, వాటిల్లో అత్యధికం దుబారా పనులే ఉన్నాయని తెలుస్తోంది. 20 అడగుల వెడల్పు లేని చోట డివైడర్లు కట్టారు. వాటికి రంగులు అద్దారు. న్యాక్ కమిటీ వస్తుందని చెప్పి శిథిలావస్థలో ఉన్న భవనాలకు పెయింట్లు, టైల్స్ అంటించి రూ.కోట్ల నిధులు మంచినీళ్ల ప్రాయంలా వెచ్చించేశారు. వాటన్నింటిపై విచారణ జరుగుతుందని అప్రమత్తమైన నాటి పాలకులు.. విజిలెన్స్ నుంచి మీకు ఫోన్లు చేసి స్టేట్‌మెంట్ల కోసం పిలిచినా..ఫోన్‌లోనే ఆయా వివరాలు నిర్ధారించుకుంటున్నా..కళాశాలలకు నేరుగా వచ్చి ఆరా తీసినా మాకు వ్యతిరేకంగా చెప్పకూడదని వర్సిటీ పరిధిలోని కాలేజీ యాజమాన్యాలు, అధ్యాపకులను కోరుతున్నారు. ఇది వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

పరీక్షలు పెట్టామని చెప్పండి

వైకాపా హయాంలో వర్సిటీ పరిధిలో మూడేళ్ల పాటు బీఈడీ ప్రయోగ పరీక్షలే నిర్వహించలేదు. విశ్వవిద్యాలయం పరిధిలో 100కు పైగా కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో చదివే అత్యధిక విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారే. ఆయా రాష్ట్రాల నుంచి ప్రాక్టికల్ పరీక్షలు రాయడానికి వస్తే ఇక్కడ హోటల్‌లో బస, భోజనాలు, వచ్చి, పోయేందుకు ఛార్జీలు సగటున ఒక్కో విద్యార్థికి రూ.15 వేల నుంచి రూ.20 వేల దాకా ఖర్చవుతుంది. అందులో సగం మాకిస్తే మేమే వర్సిటీ అధికారులతో లాబీయింగ్ చేసి ప్రాక్టికల్ పరీక్షలు జరపకుండా మేనేజ్ చేస్తామని కాలేజీ యాజమాన్యాలు తొలుత పిల్లల నుంచి సొమ్ము వసూలు చేశాయి. ఆమొత్తం నుంచి కాలేజీలు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర దాకా వర్సిటీ అధికారులకు ముడుపులు ముట్టజెప్పి వరుసగా మూడేళ్ల పాటు బీఈడీ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించకుండా జాగ్రత్త పడ్డారన్నది బహిరంగ రహస్యమే. అయితే ఈ విషయం నాడు ఉన్నత విద్యామండలి, ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో మా సంగతేమిటని వారు గట్టిగా నిలదీయడంతో కొంత వారికి సమర్పించుకుని నాడు ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. మూడేళ్లలో కలిపి రూ.4-5 కోట్ల దాకా వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. అప్పటి అక్రమాలపై ప్రస్తుతం విజిలెన్స్ విచారణ జరుగుతోందని తెలుసుకుని పీజీ పరీక్షల విభాగంలో పనిచేసిన నాటి అధికారి ఒకరు హడావుడిగా బీఈడీ కళాశాలల యాజమాన్యాలతో పాటు అందులో పనిచేసే అధ్యాపకులకు ఫోన్లు చేసి గతంలో ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయా లేదా అని అడిగే అవకాశం ఉంది. ఒకవేళ ఫోన్ చేసి అడిగినా ప్రాక్టికల్ పరీక్షలు పెట్టామని చెప్పండని బతిమిలాడుతున్నారని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. పరీక్షలు పెట్టినట్లు తాము పక్కాగా షెడ్యూల్ రూపొందించామని..అడిగితే ఆ దస్త్రాలిస్తాం. మీకేం ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. కానీ అధ్యాపకులు అందుకు ససేమిరా అంటున్నారు. మీరు పరీక్ష పెట్టినట్లు షెడ్యూల్ కాపీ అందజేసినా విద్యార్థులకు ఎక్కడ ప్రయోగ పరీక్షలు నిర్వహించారు. వారు ఏ పాఠశాలలో బోధన చేశారు..అందుకు సంబంధించిన సీడీ ఫైల్స్ కోరితే అంతా దొరికి పోతామని కొందరు పరీక్షలు జరిగినట్లు చెప్పలేమని స్పష్టంగా చెబుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇంజినీరింగ్ పనులపై మాత్రమే విజిలెన్స్ విచారణ జరుగుతున్నా మిగిలిన విభాగాలు అప్రమత్తం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. విజిలెన్స్ విచారణకు తాజాగా కొన్ని రికార్డులు కోరారని, వాటిని ఇచ్చే పనిలో ఉన్నామని వర్సిటీ వర్గాలు ధ్రువీకరించాయి.

యువతి బ్రెయిన్ డెడ్‌పై అనుమానాలు

- కారులో ఎక్కించుకుని వెళ్లిన రౌడీషీటర్
- ప్రైవేటు వైద్యశాలలో చేర్చి పరార్
- పోలీసుల అదుపులో నిందితుడు

తెనాలి టౌన్, నగరపాలెం (గుంటూరు), న్యూస్‌టుడే: యువతిని కారులో ఎక్కించుకుని వెళ్లిన రౌడీషీటర్, గంటల వ్యవధిలోనే అపస్మారక స్థితిలో ఆమెను వైద్యశాలలో చేర్చి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి పరారైన ఘటన గుంటూరు జిల్లా తెనాలిలో కలకలం రేపింది. సత్వరం స్పందించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. తెనాలి రెండో పట్టణ పోలీసులు, బాధిత యువతి కుటుంబ సభ్యులు కథనం ప్రకారం... తెనాలి ఐతానగర్‌కు చెందిన మదిర సహానా (25) పట్టణంలోని ఒక స్పీచ్ అండ్ హియరింగ్ థెరపీ కేంద్రంలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నారు. రోజూ మాదిరిగానే శనివారం సాయంత్రం ఆమె ఇంటి వద్ద నుంచి తాను పనిచేసే చోటికి బయల్దేరారు. రాత్రి 7 గంటల సమయంలో నవీన్ అనే యువకుడు సహానా ఫోన్ నుంచి ఆమె తల్లికి ఫోన్ చేసి మీ అమ్మాయి కళ్లు తిరిగి పడిపోతే ప్రైవేటు వైద్యశాలలో చేర్చానని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆ వైద్యశాలకు వెళ్లారు. వారు వచ్చిన తరవాత నవీన్ అక్కడి నుంచి పరారయ్యాడు.

నవీన్‌పై రౌడీషీట్..



నవీన్

కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన నవీన్ 2016లో జరిగిన హత్య కేసులో నిందితుల్లో ఒకడు. దానితో అతనిపై రౌడీషీట్ నమోదై ఉంది. కోడి మాంస విక్రయ దుకాణం నడుపుతున్నాడు. సహానా నివాసం ఉంటున్న ప్రాంతంలోనే నవీన్ బంధువులు ఉన్న క్రమంలో అక్కడకు వచ్చిపోతున్న సమయంలో ఇద్దరి మధ్య పరిచయం పెరిగింది. ఇరువురి సామాజిక వర్గాలు ఒకటే. శనివారం తన పుట్టిన రోజు వేడుక ఉందని ఆమెను పిలిచిన నవీన్ స్థానిక ప్రకాశంబజార్ నుంచి ఆమెను కారులో ఎక్కించుకుని బయల్దేరాడు. మార్గమధ్యలో తాను ఆకస్మికంగా బ్రేక్ వేయటంతో సహానా తల డ్యాష్ బోర్డుకు కొట్టుకుందని, దానితో అస్వస్థతకు గురైన ఆమెను తాను వైద్యశాలలో చేర్చినట్లు అతను పోలీసులకు చెప్పాడు.

వైద్యశాలల చుట్టూ తిరిగిన కుటుంబ సభ్యులు..



సహానా (పాత చిత్రం)

తెనాలిలోని ప్రైవేటు వైద్యశాల వారు సహానా మెదడులో రక్తం గడ్డ కట్టిందని, మెరుగైన చికిత్సకు గుంటూరుకు తీసుకెళ్లాలని సూచించడంతో శనివారం రాత్రి కుటుంబ సభ్యులు ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కూడా బ్రెయిన్‌డెడ్ అని చెప్పడంతో మరో రెండు వైద్యశాలలు తిరిగి ఆమెను ఆదివారం ఉదయం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు.. ఇక్కడ న్యూరోసర్జన్ లేకపోవడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

ఆ రెండు గంటలు ఏం జరిగింది?

నవీన్ సహానాను కారు ఎక్కించుకుని వెళ్లి తిరిగి వైద్యశాలకు చేర్చే నడుమ ఉన్న ఆ రెండు గంటల సమయంలో ఏం జరిగిందన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. నిందితుడు చెబుతున్నట్లు ఆకస్మిక బ్రేక్ వల్ల ప్రమాదం జరిగిందా? లేదా అతను ఆమెపై దాడి చేశాడా? అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఆదివారం ఉదయం ఘటన జరిగిన సమాచారం పోలీసులకు అందగానే వారు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతను వినియోగించిన కారునూ స్వాధీనం చేసుకున్నారు. విచారణ కొనసాగుతుంది.

మా అమ్మాయి శరీరంపై గాయాలు ఉన్నాయి



సహానా తల్లి అరుణ కుమారి గుంటూరు వైద్యశాల వద్ద మీడియాతో మాట్లాడుతూ తన బిడ్డ శరీరంపై అనేక చోట్ల గాయాలు ఉన్నాయని, నవీన్‌తో పాటు మరి కొందరు కూడా కారులో ఉన్నట్లు తమకు అనుమానంగా ఉందన్నారు. తమ కుమార్తెకు ఈ పరిస్థితి కల్పించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైకాపా నాయకులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హైదరాబాద్ విమాన సర్వీసు రద్దు

గన్నవరం గ్రామీణం : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసు సాంకేతిక కారణాలతో ఆదివారం అర్ధంతరంగా రద్దయ్యింది. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 12:15 గంటలకు ఇక్కడికి చేరుకోవాల్సిన విమానం.. మధ్యాహ్నం 1:45 గంటలకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో సాంకేతిక సమస్య తలెత్తింది. పరిష్కారానికి అధికారులు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి సర్వీస్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో 110 మంది ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేయగా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

రెచ్చిపోతున్న రౌడీషీటర్లు

ఈనాడు-అమరావతి

చోద్యం చూస్తున్న పోలీసులు

ఎస్పీ కౌన్సెలింగ్ ఇస్తున్నా.. కానరాని మార్పు

జిల్లాలో రౌడీషీటర్లు.. పాత నేరస్థులపై పోలీసుల నిఘా కొరవడింది. ఇదే అదనుగా వారు రెచ్చిపోతున్నారు. తమపై పోలీసుల దృష్టి ఉండడం లేదని..ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని దందాలు.. దౌర్జన్యాలకు తెగబడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. గత రెండు రోజుల వ్యవధిలో అరండల్‌పేట, తాడేపల్లి, తెనాలి పోలీసు స్టేషన్ల పరిధిలో చోటుచేసుకున్న ఉదంతాలే అందుకు నిదర్శనం.

అకారణంగా కత్తితో దాడి.. గుంటూరులో శనివారం రాత్రి అరండల్‌పేట స్టేషన్ పరిధిలో ఓ బార్‌లో మద్యం తాగడానికి వెళ్లిన యువకుడిపై అకారణంగా ఆ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ చింతగుంట్ల ప్రవీణ్ కత్తితో దాడి చేశాడు. ఆ ఘటనను చూసిన స్థానికులు, బార్ నిర్వాహకులు ప్రాణ భయంతో తలో దిక్కుకు ఉరుకులు పరుగులు తీశారు. రౌడీషీటర్ ప్రవీణ్ మరో స్నేహితుడితో కలిసి ఓ బార్‌కు వెళ్లాడు. వారి కన్నా ముందే అదే బార్‌కు శారదాకాలనీకి చెందిన ఓ యువకుడు మద్యం తాగడానికి వెళ్లి మందు ఆర్డర్ చెబుతున్నారు. మేం ముందుగా వచ్చాం. మా తర్వాత వచ్చి మందు కోసం హడావుడి చేస్తున్నావేంటి? అసలు నీ ఇల్లు ఎక్కడ్రా అంటూ అతన్ని దుర్భాషలాడి కత్తి తీసి వేటు వేసి భయభ్రాంతులకు గురిచేశాడు. అక్కడ ఉన్న కొందరు అడ్డుకోవడంతో ఆ యువకుడు త్రుటిలో తప్పించుకున్నాడు. ఆ సమయంలో బార్‌లోపల ఉన్న కొందరు ఈ దాడి ఘటన గురించి తెలుసుకుని భయంతో పరిగెత్తారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో సంజీవయ్యనగర్ ప్రధాన రహదారిలో ఓ వ్యక్తిని హత్య చేసిన వారిలో ప్రవీణ్ నిందితుడు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న అతను శారదాకాలనీ ప్రాంతంలో నిత్యం హల్‌చల్ చేస్తున్నాడని సమాచారం ఉన్నా..అతని ఆట కట్టించడంలో అరండల్‌పేట పోలీసులు విఫలమయ్యారు. దీంతో అతని ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇతర విధుల నిర్వహణతో..

రాజధాని జిల్లా కావడంతో ఇక్కడి పోలీసులకు తరచూ ఏదో ఒక ప్రభుత్వ కార్యక్రమం, వీఐపీల బందోబస్తు నిర్వహించాల్సి రావడంతో వారికి తమ స్టేషన్ పరిధిలో జరిగే వ్యవహారాలు కొన్ని తెలియకుండా పోతున్నాయి. క్రమంగా స్టేషన్‌పై వారు పట్టుకోల్పోతున్నారు. మరోవైపు వైకాపా ఐదేళ్ల పాలనలో రౌడీషీటర్లకు సక్రమంగా కౌన్సెలింగ్ ఇవ్వలేదు. ఇది కూడా వారు పక్కదారి పట్టడానికి కారణమైంది. ఇటీవలే వారిలో మార్పు తీసుకురావాలని జిల్లాఎస్పీ సతీష్‌కుమార్ నేరుగా రౌడీషీటర్లు, వారి కుటుంబీకులను పిలిపించుకుని కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మీరు చేసే తప్పులకు పిల్లలకు శిక్షపడుతుందని, వారి విద్యా రికార్డుల్లో తల్లిదండ్రుల నేపథ్యం గురించి రాస్తారు. రౌడీషీటర్ పిల్లలు అంటే విద్యా సంస్థలు చేర్చుకోవడానికి వెనకంజవేస్తాయి. దాన్ని గుర్తెరిగి సన్మార్గంలో నడవాలని వారికి పిలుపునిచ్చారు. ఇలా ఒకవైపు కౌన్సెలింగ్ ఇస్తుండగానే మరోవైపు కొందరు రెచ్చిపోవడం అధికారులకు తలనొప్పిగా మారింది.

★ **తాడేపల్లి ఠాణా పరిధిలో..** హరికృష్ణ అనే మరో రౌడీషీటర్ మూడు రోజుల కిందట ఎర్రబాలెంకు చెందిన సురేష్ అనే యువకుడిని చితకబాదడం సంచలనమైంది. హరికృష్ణ అక్రమ ఇసుక తవ్వకాల గురించి ఉన్నతాధికారులకు సమాచారమిస్తున్నారనే అక్కసుతో సురేష్‌పై దాడికి తెగబడినట్లు చెబుతున్నారు. రౌడీషీటర్ హరికృష్ణ దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల ద్వారా ఎస్పీ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తాడేపల్లి పోలీసులు రంగంలోకి దిగి అతన్ని అరెస్టు చేశారు. రౌడీషీటర్ ఇసుక అక్రమ వ్యాపారం చేస్తుంటే పోలీసులకు తెలియదా?.. పట్టించుకోలేదంటే దాన్ని పోలీసుల మెతక వైఖరి అనాలా? లేక అతను చేసే అక్రమ వ్యాపారం నుంచి పోలీసులకు ముడుపులు ముడితే చూసీచూడనట్లు మిన్నకుండి పోయారా అనేది ఉన్నతాధికారులే నిగ్గు తేల్చాలి. స్టేషన్ పోలీసులకు పట్టకపోయినా..అక్కడ నుంచి ఎస్పీకి సమాచారం చేర వేయాల్సిన స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్‌కు రౌడీషీటర్ వ్యవహారాలు తెలియవంటే నమ్మశక్యం కావడం లేదు.

★ **కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన నవీన్** ఓ వ్యక్తిని హత్య చేయగా అతనిపై రౌడీషీట్ ఉంది. అతను శనివారం ఓ యువతితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో వారి వాహనానికి మరో వాహనం అడ్డు వచ్చిందని, ఒక్కసారిగా బ్రేకు వేయగా కారులోని యువతి తలకు గాయమైంది. బాధిత యువతి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి రౌడీషీటర్ పరారు కాగా, కొద్ది గంటల తర్వాత పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తంగా రౌడీషీటర్ల ఆగడాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

నకిలీలొస్తున్నాయ్ జాగ్రత్త!

మార్కెట్లో నాణ్యతలేని పురుగు మందులు

మోసపోతున్న రైతులు



కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఓ రైతు వరి పైరులో దోమల నియంత్రణకు ప్రముఖ కంపెనీ పేరు మీద ఉన్న పురుగుల మందు కొనుగోలు చేసి వాడారు. దోమల బెడద తగ్గక పోగా పంట దెబ్బతినడంతో వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. శాస్త్రవేత్తలు ఆ పైరును పరిశీలించి తేల్చిందేమంటే.. రైతు వాడింది నకిలీ పురుగు మందు అని.

ఈనాడు - అమరావతి

మార్కెట్లో నకిలీ పురుగుమందులు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రత్యేకించి వరి రైతులు ఎక్కువగా వినియోగించే దోమల నివారణ మందులకు నకిలీవి సృష్టించి ప్రముఖ బ్రాండ్ల పేరుతో మార్కెట్లోకి తెస్తున్నారు. ఒక ప్రముఖ కంపెనీ దోమల మందు 94 మిల్లీ లీటర్ల సీసా ఖరీదు గరిష్ఠ చిల్లర ధరకన్నా తక్కువగా రూ. 1,220కు విక్రయిస్తున్నారు. ఈ మందు బాగా పని చేస్తుందన్న నమ్మకంతో రైతులు విరివిగా వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా ఈ కంపెనీని పోలిన నకిలీ మందును మార్కెట్లోకి తీసుకొచ్చారు అక్రమార్కులు.

హైదరాబాద్ కేంద్రంగా తయారీ

హైదరాబాద్ నగర శివార్లలో బయో ఉత్పత్తులు తయారు చేసే కంపెనీలున్నాయి. వీటి మాటున కొంతమంది నకిలీలు తయారు చేసి మార్కెట్లోకి వదులుతున్నారు. ఇందుకోసం ప్రముఖ కంపెనీలకు చెందిన, భారీగా డిమాండ్ ఉన్న పురుగుమందుల డబ్బాలను పోలినవి వినియోగిస్తున్నారు. డబ్బాల్లో తేడా లేకపోవడం, ఎప్పుడూ కొనుగోలు చేసే దుకాణాల్లోనే వాటిని విక్రయిస్తుండడంతో రైతులకు అనుమానం రావడం లేదు. పైగా వీటిని ద్వితీయశ్రేణి పట్టణాల్లో ఎక్కువగా విక్రయిస్తున్నారు. వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల నిఘా తక్కువ ఉండడమే దీనికి కారణం. ఈ నకిలీ మందులు హైదరాబాద్ నుంచి ట్రాన్స్‌పోర్టు కంపెనీల ద్వారా గుంటూరు చుట్టుపక్కల పట్టణాలకు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి మండల కేంద్రాలకు సరఫరా అవుతున్నాయి.

దళారులదే హవా

★ పురుగుమందుల వ్యాపారంలో దళారుల ప్రమేయం ఎక్కువగా ఉంటోంది. ఉమ్మడి జిల్లాలో పత్తి, మిర్చి పంటల సాగు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విత్తనాలు, పురుగుమందుల వ్యాపారులెక్కువగా ఉన్నారు. పోటీ కారణంగా మార్జిన్‌ను పట్టించుకోకుండా ఒక్కొక్కరు ఒక్కో ధరకు విక్రయిస్తుంటారు. గుంటూరు కేంద్రంగా ఉన్న దళారులు.. ప్రముఖ కంపెనీలు ఇక్కడి వ్యాపారులకిస్తున్న ధరలతో, వేరే రాష్ట్రంలోని ధరలతో పోల్చి తక్కువకు వస్తున్న ప్రాంతాల నుంచి సరఫరా అయ్యేలా చక్రం తిప్పుతున్నారు. దీంతో రిటైల్ ధరలకొచ్చేసరికి కొంత తేడా ఉంటోంది. ఈ క్రమంలో డిమాండ్ ఉన్న పురుగుమందులకు నకిలీలు వస్తున్నాయి. వీటిని రైతులు గుర్తించలేక మోసపోతున్నారు. గడువు మీరిన మందులను మళ్లీ రీప్యాక్ చేసి విక్రయిస్తున్న ఘటనలూ ఉన్నాయి.

ఇలా అడ్డుకోవచ్చు

★ ప్రముఖ కంపెనీల పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు డబ్బాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను యాప్ ద్వారా స్కాన్ చేస్తే అది ఒరిజనలా? కాదా? స్పష్టమవుతుంది. రైతులు ఆయా కంపెనీల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ పరిజ్ఞానం తెలియకపోతే వ్యాపారిని కచ్చితంగా స్కాన్ చేసి చూపించాలని కోరి నిర్ధారించుకున్న తరువాతే కొనుగోలు చేయాలి. నకిలీ డబ్బాలపైనా క్యూఆర్ కోడ్ ఉంటోంది. రైతులు తనిఖీ చేయగలిగితే మోసపోకుండా బయటపడొచ్చు.

ప్రకాశం బ్యారేజీకి 1,62,689 క్యూసెక్కుల వరద

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీకి ఆదివారం సాయంత్రానికి ఎగువ నుంచి 1,62,689 క్యూసెక్కుల వరద నీరు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 3,923 క్యూసెక్కులు, పశ్చిమ ప్రధాన కాలువకు 1,516 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12 అడుగులు కాగా... 20 గేట్లను 4 అడుగులు, 50 గేట్లను 3 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

అమరవీరులారా మీకు వందనం



వారి జ్ఞాపకాలతో బతుకుతున్న కుటుంబ సభ్యులు

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే

ప్రజలు ప్రశాంతంగా జీవించటానికి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎండనక, వాననక, కష్టపడి పనిచేస్తుంటారు. పగలు, రాత్రి కంటిమీద కునుకులేకుండా కాపలాకాస్తుంటారు. ప్రజల మాన, ప్రాణాలు కాపాడేక్రమంలో వివిధ ప్రమాదాల్లో సైతం వెనుకాడరు. విధి నిర్వహణలో తనప్రాణాలను తృణప్రాయంగా అర్పించే ఏకైక కొలువు పోలీసు ఉద్యోగం. **నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం.** సంఘవిద్రోహశక్తుల చేతిలో వీరమరణం పొందినవారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిది.

1975లో తొలి రక్తపుమరకలు

ఒకప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో మావోయిస్టుల (నక్సలైట్లు) ప్రభావం తీవ్రంగా ఉండేది. వారిని దీటుగా పోలీసులు ధైర్యసాహసాలతో ఎదుర్కొని పోరాడేవాళ్లు. జిల్లాలో తొలిసారిగా 43 ఏళ్ల కిందట ఖాకీ దుస్తులపై రక్తపుమరకలు అంటుకున్నాయి. 1975లో చెరుకుపల్లిలో నక్సలైట్లదాడిలో తొలిగా వీరే వీరమరణం పొందారు. 1992లో రెంటచింతలలో, 2001లో బొల్లాపల్లిలోని రెమిడిచర్లలో, 2002లో, 2003లో దాచేపల్లిలో, 2004లో రెమిడిచర్లలో, 2005లో చిలకలూరిపేటలో ఇలా ఉమ్మడి జిల్లాకు చెందిన మొత్తం 27 మంది పోలీసులు వీరమరణం పొందారు.

కన్నీరు ఇంకిపోతుంది

ఒక్కగానొక్క కుమారుడిని ఎంతోగారాబంగా పెంచి పెద్దచేసి పోలీసుశాఖలో కొలువుకు పంపించాం. రెండు రోజుల్లో ఇంటికి తిరిగి వస్తున్నానంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేసిన ఆ బిడ్డలు అసాంఘిక శక్తుల చేతిలో అమరవీరులయ్యారనే వార్త వారికి తీరని గుండెకోతను మిగిల్చింది. ఇలా బిడ్డకోసం వృద్ధ తల్లిదండ్రులు, భర్త కోసం భార్య, తండ్రి కోసం పిల్లలు..ఇలా అందరూ వారి జ్ఞాపకాలతో బతుకుతున్నారు. వారు తమ నుంచి దూరమయ్యారని గుర్తుకు వచ్చినప్పుడల్లా వెక్కివెక్కి ఏడ్చే వారి కన్నీరు ఇంకిపోయింది. ఈక్రమంలో కొంతమంది కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు అమరవీరుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆ బొమ్మలను ప్రాణాలు ఉన్న తమ పిల్లలుగా చూసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పుట్టిన రోజులు, వీరమరణం చెందిన తేదీల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు, దాన ధర్మాలు చేస్తున్నారు.

ఆరు రోజుల పసిగుడ్డును వదిలి..



ఎస్సై తోట వెంకటేశ్వర్లు (పాతచిత్రం)



నా భర్త తోట వెంకటేశ్వర్లు ఎస్సైగా పనిచేసేవారు. నాకు ఇప్పటికీ ఆరోజు బాగా గుర్తుంది. 2001 ఆగస్టు 20వ తేదీ బొల్లాపల్లి మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. అప్పటికే మాకు పెద్దది పాప రాణి రుక్మిణి. బాబు రాజా వెంకట ప్రమోద్‌ను ప్రసవించి ఆరు రోజులు. నేను బాలింతరాలుగా ఉండి మంచం మీద నుంచి కిందకు దిగలేని పరిస్థితి. కొద్ది రోజులు విధులకు సెలవు పెట్టమని అడిగాను. ఎన్నికలు కావడంతో సెలవు పెట్టడం కుదరని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బందోబస్తు విధులు చూసుకొని వస్తున్న క్రమంలో రెమిడిచర్లలో మావోయిస్టులు అమర్చిన బాంబు పేలి జీపులోని అందరూ మృతిచెందారు. ఒక పక్క పాపను, మరోపక్క ఆరురోజుల పసిగుడ్డును పెట్టుకొని నేను రోదించిన తీరు చెప్పలేనిది. ప్రతి రోజు ఆయన తిరిగి వస్తాడనే ఆశతో బతుకుతున్నాం. **- తోట ఉషారాణి, కొరిటెపాడు**

ఒక్కగానొక్క అబ్బాయి



మాది ఒక్కగానొక్క అబ్బాయి కె.గోరేశంకర్. గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌గా పనిచేశాడు. సెలవు ఇవ్వగానే వస్తానని చెప్పాడు. 2007 నుంచి అతని కోసం ఎదురుచూస్తూ బతుకుతున్నాం. మా అబ్బాయి జ్ఞాపకంతో కాత్రపాడులో విగ్రహం తోపాటు బస్టాండ్‌ను నిర్మించాం. అమరవీరుల దినోత్సవం రోజు అన్నదానం చేస్తున్నాం.

- కె.సుబ్బారావు, రత్నకుమారి, కాత్రపాడు

బిందె పానకం రూ. 30

❖ తయారీ బాధ్యత అక్షయ పాత్రకు
❖ మంత్రి లోకేశ్ ఆదేశాలు

మంగళగిరి, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి సమర్పించే పానకం తయారీ బాధ్యతలను మంత్రి లోకేశ్ సూచనలు మేరకు అక్షయ పాత్రకు ఇచ్చారు. గతంలో ప్రైవేటు వ్యక్తులు బిందె పానకం రూ.50 నుంచి రూ.60కి విక్రయించేవారు. నాణ్యత లేని పానకం సరఫరా చేయడమే కాక భక్తులు స్వామివారికి సమర్పించిన పానకం తిరిగి తీసుకువెళ్లేందుకు అవసరమైన ప్లాస్టిక్ సీసాల ధరలు కూడా ఇష్టానుసారంగా విక్రయిస్తూ భక్తులను నిలువు దోపిడీ చేసేవారు. ఇలాంటి సమస్యలన్నీ మంత్రి దృష్టికి వెళ్లడంతో ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో భాగంగా భక్తులకు అనువుగా ఉండే విధంగా తక్కువ ధరకు బిందె పానకం అందజేసేందుకు దీని బాధ్యతలను అక్షయ పాత్రకు దేవాదాయశాఖ అప్పగించింది. ఒక బిందె పానకం రూ.30కు విక్రయించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. భక్తులు స్వామివారికి పానకం సమర్పించే సమయాలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 3:30 గంటల వరకు ఉంటుందని దేవాదాయ సహాయ కమిషనర్ రామ కోటిరెడ్డి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి భక్తులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

రాష్ట్ర టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘ నూతన కార్యవర్గం



ఎన్నికైన సంఘ నూతన అధ్యక్షుడు జి.మోహన్‌గోపాలకృష్ణ, ఇతర కార్యవర్గ సభ్యులు

గుంటూరు (జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరులోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల అధికారి సీహెచ్.నాగభూషణం, సహాయ ఎన్నికల అధికారి పి.శివరామకృష్ణ ఫలితాలు ప్రకటించారు. కార్యవర్గ వివరాలివీ..

❖ రాష్ట్ర అధ్యక్షుడిగా జి.మోహన్‌గోపాలకృష్ణ (రాష్ట్ర సచివాలయం), ప్రధాన కార్యదర్శిగా బి.సి.శంకర్‌నాయక్ (కర్నూలు జిల్లా) కోశాధికారిగా బి.సురేష్ బాబు (ప్రకాశం), సహాధ్యక్షుడిగా ఏసుబాబు (కృష్ణా), ఉపాధ్యక్షులుగా బి.చిన్నారావు (పశ్చిమ గోదావరి), బి.బ్రహ్మానందరెడ్డి (కర్నూలు), వి.చంద్రశేఖర్ (గుంటూరు), మహమ్మద్ జాకిర్ (అనంతపురం), కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్ఎస్‌కే శర్మ (నెల్లూరు), జి.ప్రాణేష్‌రావు (అనంతపురం), వి.రామకృష్ణ (కృష్ణా), కె.మురళి (ప్రకాశం), కార్యదర్శులుగా కె.అరుణ్‌కుమార్ (శ్రీకాకుళం), జి.మహమ్మద్ అలీ (కర్నూలు), ఎస్.కె.నజీర్ మహమ్మద్ (గుంటూరు), ఎం.సుధాకర్ (చిత్తూరు) ఎన్నికయ్యారు. క్రీడా కార్యదర్శి ఎం.ప్రవీణ్‌కుమార్ (వైఎస్ఆర్), మహిళా ప్రతినిధులుగా వాణిశ్రీ, దీప (గుంటూరు)లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులను గుంటూరు జిల్లా అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. రాష్ట్రంలో టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని నాయకులు తెలిపారు. సమావేశంలో జిల్లాల నాయకులు, టైపిస్టులు, స్టెనోగ్రాఫర్లు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా చట్ట సాయం అందించాలి



విజ్ఞాన్‌లో న్యాయ విద్యార్థులతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి, లావు రత్తయ్య, తదితరులు

పొన్నూరు, న్యూస్‌టుడే: ప్రో-బోనో క్లబ్ పథకం ద్వారా న్యాయ విద్యనభ్యసించే విద్యార్థులు పేదలకు ఉచితంగా చట్టపరమైన సహాయం అందించాల్సి అవశ్యకత ఉందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి పేర్కొన్నారు. ఆదివారం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ప్రో-బోనో క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రో-బోనో క్లబ్ పథకం ద్వారా న్యాయ సేవలను అందించడంలో ఉన్న అంతరాలను తగ్గించాలని పేర్కొన్నారు. ప్రజలకు చట్టపరమైన సహాయం అందించడమే లక్ష్యంతో ప్రభుత్వం, న్యాయవర్గాలు కలిసి పని చేయాలని కోరారు. నిరుపేద, మహిళలు వృద్ధులు, దివ్యాంగులు వంటి సమాజంలోని బలహీన వర్గాలకు ఈ పథకం చాలా ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అమరావతిలోని ఏపీ స్టేట్ లీగల్ సర్వీసస్ అథారిటీ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి మెంబరు, సెక్రటరీ ఎం.బబిత మాట్లాడుతూ న్యాయం కావాల్సిన వారు 15100 నంబరుకు ఫోన్ చేయవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నాల్గో అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్.శరత్‌బాబు, అమరావతిలోని ఏపీ స్టేట్ లీగల సర్వీసస్ అథారిటీ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ హెచ్.అమర రంగశ్వరరావు, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసస్ అథారిటీ సెక్రటరీ పి.లీలావతి, విజ్ఞాన్స్ విద్యా సంస్థల అధ్యక్షుడు లావు రత్తయ్య, ఉపకులపతి పి.నాగభూషణం పాల్గొన్నారు.

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాలు



డాక్టర్ చివుకుల సాంబశివరావుకు పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

నగరంపాలెం, న్యూస్‌టుడే : విద్యారంగానికి ఎనలేని కృషి చేస్తున్న ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాల యాజమాన్యాలకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాలు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక ఆంధ్రక్రైస్తవ కళాశాలలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్‌పీఎల్‌టీఓ) ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజేఏ అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పాల్గొన్నారు. విద్యారంగాభివృద్ధికి కృషి చేసిన వారికి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పీఎల్‌టీఓ అధ్యక్షుడు పి.నాగయ్య మాట్లాడుతూ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే నసీర్, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావులను కోరారు. అనంతరం డాక్టర్ చివుకుల సాంబశివరావుకు డాక్టర్ అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అందజేశారు. దీంతోపాటు 8 రాష్ట్రాలకు చెందిన ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాన్ని, రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రైవేట్ కళాశాల డైరెక్టర్లు, అసిస్టెంట్, అసోసియేషన్ ప్రొఫెసర్లను ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్ర క్రైస్తవ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మోజెస్, న్యాయకళాశాల వైస్ ప్రిన్సిపల్ అమృతవర్షిణి, ప్రైవేట్ విద్యా సంస్థల ప్రతినిధులు కాటూరి వెంకటేశ్వరరావు, మేకల రవీంద్రబాబు, ఎస్‌పీఎల్‌టీఓ రాష్ట్ర నాయకులు కొండపల్లి విల్సన్, కావూరి గోవిందరావు, ఎస్పీ రసూల్, జహంగీర్, రత్నకుమార్ పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి:సీపీఐ

తాడేపల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని బ్రహ్మానందపురం ఏసీసీ, కృష్ణా సిమెంటు ఫ్యాక్టరీ కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆదివారం విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. ఈమేరకు లేఖ ప్రతులను విడుదల చేశారు. 'ప్రజా దర్బార్‌లో అనేక మంది బాధలను వింటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు అభినందనలు. ఏసీసీ, కృష్ణా సిమెంటు ఫ్యాక్టరీని యాజమాన్యం అక్రమంగా లాకౌట్ ప్రకటించి నేటికి 32 ఏళ్లు గడుస్తోంది. సెంట్రల్ లేబర్ ట్రిబ్యునల్ కోర్టు, హైకోర్టు వారికి చెందిన భూములను వేలం వేసి కార్మికులకు రూ. 43 కోట్లు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. నేటికి ఈ ప్రక్రియ అమలు జరగలేదు. 333 మంది కార్మికులకు 160 మందికిపైగా కార్మికులు అనారోగ్యంతో అర్థాకలితో మరణించారు. వివిధ రూపాల్లో కార్మికులు ఆందోళన చేపట్టిన నేటికి సమస్య పరిష్కారం కాలేదు. సిమెంటు ఫ్యాక్టరీకి సంబంధించిన 137 ఎకరాలు ఆస్తులు ఉన్నాయి. వీటి విలువ రూ. 1,400 కోట్లకు పైగా ఉంటుంది. ఆస్తులను కార్మికులను ఆదుకోవాలని' రామకృష్ణ మంత్రి లోకేశ్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు.

షేక్ కరిముల్లా మృతికి సీఎం సంతాపం

ఈనాడు, అమరావతి : తెదేపా మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, గుంటూరుకు చెందిన షేక్ కరిముల్లా మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన ఆయన మరణం బాధాకరమని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కరిముల్లా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పీఎం ఆవాస్ యోజనపై కార్యశాల నేడు

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే : ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకంలో గృహాల మంజూరు, నిర్మాణాలపై ప్రాంతీయ స్థాయి కార్యశాలను గుంటూరులో నిర్వహించనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి, గుంటూరు పార్లమెంట్ సభ్యుడు పెమ్మసాని చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం ఉదయం 9 గంటలకు గుంటూరు రింగ్ రోడ్డులోని ఐటీసీ వెల్‌కం హోటల్‌లో ప్రారంభం కానుంది. 10.45 నుంచి 11 గంటల వరకు కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడతారు. అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు సంబంధించి పీఎం గ్రామీణ్ గృహాల నిర్మాణం, సాధించిన ప్రగతిపై ఆయా రాష్ట్రాల అధికారులు వివరించనున్నారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు, రాష్ట్రాల అధికారులు హాజరు కానున్నారు. ఈ నెల 22న క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పర్యటించి గృహాల నిర్మాణాల పనులను పరిశీలిస్తారు.

టాటా సంస్థల సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న చెరుకూరి కుటుంబరావు, పక్కన మాణిక్యవరప్రసాద్, లక్ష్మణరెడ్డి తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: టాటా సంస్థలు దేశానికి, ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివని ఆర్థిక నిపుణులు చెరుకూరి కుటుంబరావు అన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో 'భారత ప్రగతిలో టాటాల పాత్ర'పై ఆదివారం ఏర్పాటుచేసిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ టాటా గ్రూప్ దేశానికి ఆర్థిక పునాదులు వేసిందని, సంక్షేమం, దాతృత్వాన్ని చాటిచెప్పిందని, కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి చేసిని కృషిని కొనియాడారు. రతన్‌టాటా ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన టెట్లీ టీ కంపెనీ, కోరస్ కంపెనీ, జాగ్వర్, లాండ్ రోవర్ కార్లను టాటా గ్రూప్‌లో విలీనం చేసుకుని అభివృద్ధిలో పయనించటం భారతదేశానికి గర్వకారణమన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ రతన్‌టాటా సేవలకు గుర్తుగా సీఎం చంద్రబాబునాయుడు టాటా ఇన్నోవేటివ్ హబ్‌ను ప్రకటించటం హర్షణీయమన్నారు. జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ టాటా గ్రూప్ సంస్థ ప్రారంభంనుంచే స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మహాత్మాగాంధీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుబ్రమణ్యం, మానవత ఛైర్మన్ పావులూరి రమేష్, నేస్తం సహ వ్యవస్థాపకులు ధనుంజయరెడ్డి తదితరులు మాట్లాడారు. తొలుత రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

చేబ్రోలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. చేబ్రోలులోని పాతరెడ్డిపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కేంద్ర మాజీ మంత్రి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌దని, వాటిని ప్రభుత్వాలు దీర్ఘకాలం అమలు చేయించిన ఘనత బాబు జగ్జీవన్‌రామ్‌దేనన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో అనేక రంగాలను అభివృద్ధి చేశారన్నారు. ముందుగా చేబ్రోలు పంచాయతీ కార్యాలయం నుంచి పాతరెడ్డిపాలెం వరకు ర్యాలీ నిర్వహించారు.

జిల్లాలో సగటున 23.5 మి.మీ వర్షపాతం

కలెక్టరేట్ (గుంటూరు): జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు సగటున 23.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరు తూర్పు మండలంలో అత్యధికంగా 70.6, దుగ్గిరాల 68.6, గుంటూరు పశ్చిమ 64.2, తెనాలి 40.6, ఫిరంగిపురం 31.2, పెదకాకాని 29.2, కాకుమాను 22.6, చేబ్రోలు 22.2, ప్రత్తిపాడు 14.2, వట్టిచెరుకూరు 14.2, పెదనందిపాడు 12.4, మేడికొండూరు 10.2, తాడికొండ 7.2, కొల్లిపర 6.8, తుళ్ళూరు 6.4, పొన్నూరు 2.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

20న జడ్పీ సర్వసభ్య సమావేశం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని నవంబరు 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేసినట్లు జిల్లా పరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహిస్తారన్నారు.

బ్రాయిలర్ ధరలు

(కిలో ఒక్కింటికి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 145, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

రౌడీషీటర్ అరెస్ట్

మంగళగిరి, ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: తాడేపల్లికి చెందిన రౌడీషీటర్ హరికృష్ణ, అతని అనుచరుడు విజయవాడ కృష్ణలంకకు చెందిన రామకృష్ణను మంగళగిరి గ్రామీణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు మంగళగిరి మండలం ఎర్రబాలేనికి చెందిన సురేష్‌ను రామచంద్రపురం కట్టపై దాడి చేశారన్నారు. నిందితులిద్దరు గత కొంతకాలంగా దుగ్గిరాల మండలం పెదకొండూరు రేవు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఈ వ్యవహారంపై సురేష్ పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి వారి అనుచరులు కొంతమంది ఇసుక తరలిస్తున్నారని.. అక్కడికి వెళ్లిన సురేష్‌ను తీవ్రంగా కొట్టారు. దాడి ఘటనను కొంతమంది యువకులు వీడియో తీసి జిల్లా ఎస్పీకి పంపించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వారిపై కేసు నమోదు చేశారు. ఎస్సై చిరుమామిళ్ళ వెంకట్ నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఇద్దరికి 14 రోజుల రిమాండ్ విధించారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత



అనారోగ్యంతో బాధపడుతున్న దుగ్గిరాలకు చెందిన జంపాల ఉమామహేశ్వరరావుకు రూ.1.51 లక్షలు, గొడవర్రుకు చెందిన విశ్వనాథపల్లి దివ్యకు రూ.75 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన ధ్రువీకరణ పత్రాలను తెదేపా మండల అధ్యక్షురాలు కేశంనేని శ్రీఅనిత, నాయకులు అందజేశారు. **- న్యూస్‌టుడే, దుగ్గిరాల**

ఆలయానికి రూ.1.01 లక్షల విరాళం



నీలిమ కుటుంబసభ్యులను సత్కరిస్తున్న ధర్మకర్త రంగప్రసాద్

కంఠంరాజుకొండూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: కంఠంరాజుకొండూరు మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి విజయవాడ నగరంలోని సాయి బాలాజీ నగర్‌కు చెందిన సక్కూరు నీలిమ రూ.1,01,116 విరాళం ఇచ్చారు. ఆమె కుటుంబ సభ్యులను వంశపారంపర్య ధర్మకర్త డి. రంగప్రసాద్ సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? తాడికొండ గ్రామంలోని మార్కెట్ యార్డుకు సమీపంలో మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- వాసు, గ్రామస్థుడు**

✔ మురుగు కాలువలో పూడిక తీసి మురుగు సక్రమంగా ప్రవహించేలా చేస్తాం. పారిశుద్ధ్య కార్మికులతో ఫాగింగ్ చేయిస్తాం. **- హరిబాబు, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, తాడికొండ

? మండలంలోని డోకిపర్రు శాంతినగర్ కాలనీ రోడ్డులో గుంతలు పడ్డాయి. వర్షం పడితే బురదగా మారుతుంది. **- స్థానికులు**

✔ తక్షణమే పరిశీలిస్తాం. నిధులు మంజూరు కాగానే సిమెంట్ రోడ్డు నిర్మిస్తాం. **- అజయ్, ఏఈ, పంచాయతీ రాజ్**

– న్యూస్‌టుడే, మేడికొండూరు

? వెంకటపాలెం గ్రామంలో సాయిబాబా ఆలయం సమీపంలో ఏడాది నుంచి విద్యుత్తు నియంత్రిక మట్టిలో నిరుపయోగం పడి ఉంది. **- నాగేశ్వరావు, వెంకటపాలెం**

✔ ట్రాన్స్‌ఫార్మర్ పని చేయక పోవడంతో తొలగించాం. త్వరలో దాన్ని కార్యాలయానికి తరలిస్తాం. **- ఉమామహేశ్వరావు, విద్యుత్తు ఏఈ, మందడం** – న్యూస్‌టుడే, తుళ్లూరు

? ప్రత్తిపాడులో మహబూబ్ కాలనీ రోడ్డు, అపార్టుమెంటు రోడ్డులో ఇంటి నుంచి చెత్త సేకరణ లేకపోవడంతో అపార్టుమెంటు వద్ద చెత్త వ్యర్థాలు పడేస్తున్నారు. **- స్థానికులు, ప్రత్తిపాడు**

✔ చెత్త సేకరణ చేపడతాం. రోడ్డు వెంట ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగిస్తాం. **- షేక్.ఖాజా, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి, ప్రత్తిపాడు** – న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దు

కోవెలమూడి(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సమాచారం ఎవరికీ చెప్పవద్దని గుంటూరు దక్షిణ మండల డీఎస్పీ మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం మండలంలోని కోవెలమూడి గ్రామంలో పోలీసు శాఖ నిర్వహించిన పోలీసు వారధి అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పొదుపు మహిళలమని చెబుతూ కొందరు దగ్గరకు వచ్చేవారిని నమ్మవద్దని తెలిపారు. ఓటీపీలు పక్క వారికి పంచుకోవద్దని సూచించారు. మహిళలు వేధింపులకు గురికావద్దని, పోలీసులను ఆశ్రయించాలని పేర్కొన్నారు. సీఐ రామా నాయక్ మాట్లాడుతూ. . అపరిచిత వ్యక్తులకు సంబంధించిన సమాచారం పోలీసులకు తెలపాలని చెప్పారు.

విలీన కష్టాలు.. వీడేదెప్పుడో..?

కుంచనపల్లి(తాడేపల్లి), న్యూస్‌టుడే

చెత్త తరలింపులో చిత్తశుద్ధి కరవు ● మురుగు కాలువలో నిర్మాణం లేక అవస్థలు

మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలో విలీనమైనప్పటికీ కుంచనపల్లిని సమస్యలు వీడడం లేదు. తమ సమస్యలను పట్టించుకునే వారని, నగరంలో విలీనం చేసినా సమస్యలతో సతమతమవుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారికి పక్కనే ఉండడంతో గ్రామానికి ప్రాధాన్యత సంతరించుకుంది. గత వైకాపా ఐదేళ్ల పాలనలో గ్రామాభివృద్ధిపై దృష్టి సారించలేదు. దాదాపుగా 10 వేలు జనాభా ఉన్న గ్రామంలో తాజాగా మరో 6 వేల మంది పెరిగారు. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలను కల్పించలేదు. ప్రధాన కూడలిలో ట్రాఫిక్‌తో సమస్య ఎదుర్కొంటున్నారు. చెత్త సమస్యలతో పాటు మురుగునీటి పారుదల పారుదల సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు.

కలుషితమవుతున్న భూగర్భ జలాలు

తాగునీటి సమస్యతో గ్రామస్థులు సతమతమవుతున్నారు. ఇబ్బడి ముబ్బడిగా నిర్మాణం జరిగిన బహుళ అంతస్తులకు మురుగునీటి పారుదల సౌకర్యం లేకపోవడంతో తాగునీరు కలుషితమవుతోంది. కొన్నిచోట్ల మాత్రమే మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. దీంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఫలితంగా దుర్వాసన, దోమలు పెరిగి అనారోగ్యానికి గురవుతున్నారు. రైతులకు ప్రతీ ఏటా సాగునీటిని అందించే ఆంధ్రరత్నా ఎత్తిపోతల పంటకాలువ మురుగుతో నిండిపోయి, పొలాల్లోకి చేరి తమ పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దాదాపుగా గ్రామ పరిధిలో 25 బహుళ అంతస్తులు భవనాలు నిర్మించారు. వాటి నుంచి పన్నులైతే వసూళ్లు చేస్తారు కానీ వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలను మాత్రం నగరపాలక అధికారులు కల్పించడం లేదు. తమ గ్రామాన్ని నగరం నుంచి తొలగించాలని గ్రామస్థులు అనేక సార్లు చేసిన విజ్ఞప్తులను గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు.



శ్మశానవాటిక పక్క రోడ్డులో పేరుకుపోయిన చెత్త



సాగునీటి కాలువలో చేరిన మురుగు

తొలగింపులో నిర్లక్ష్యం

కుంచనపల్లిలో చెత్త తరలింపులో నగరపాలక అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం వల్ల బహుళ అంతస్తుల వద్ద చెత్త కుప్పలుగా పేరుకుపోతుంది. వీధుల్లో చెత్తను తొలగించడంలో కూడా చిత్తశుద్ధి చూపడం లేదు. బహుళ అంతస్తుల వద్ద టబ్బుల్లో నిల్వచేసిన చెత్తను తీసుకు వెళ్లడంలో కూడా రోజులు తరబడి ఆలస్యం చేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుంది. గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణకు అంతంత మాత్రంగా ఉంది.

ఆకుకూరలకు ప్రసిద్ధి

ఆకుకూరలు పేరు చెప్పగానే గుర్తొచ్చేది తాడేపల్లి మండలం కుంచనపల్లి. సుగంధ పరిమళాలు వెదజల్లే పొదీనా, కొత్తిమీర పంటతోపాటు తోటకూర, గోంగూర, బచ్చలి, మెంతి, పాల, చుక్క కూరలు ఇక్కడ విరివిగా పండిస్తారు. ఇక్కడ నుంచి రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలకు తరలిస్తుంటారు. కౌలురైతులుగా ఉన్న తమకు రుణాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకుంటే ఆకుకూరల పంటలను మరింత విస్తరిస్తామని చిన్నమ్మాయి అనే మహిళా రైతు తెలిపారు.

ధనుర్మాస వ్రత మహోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న త్రిదండి దేవనాద రామానుజ జీయర్‌స్వామి

తాడేపల్లి, న్యూస్‌టుడే: త్రిదండి చినజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో డిసెంబరు 16 నుంచి వచ్చే ఏడాది జనవరి 13 వరకు మంగళగిరిలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు త్రిదండి దేవనాద రామానుజ జీయర్‌స్వామి తెలిపారు. సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌లో ఆదివారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 16వ తేదీ చినజీయర్‌స్వామి విల్లిపుత్తూర్‌లోని గోదాదేవి సన్నిధి నుంచి ప్రత్యేక వస్త్ర ప్రసాదాన్ని స్వీకరించి మంగళగిరి గోష్టికి అందించేందుకు హాజరుకానున్నారని తెలిపారు. బాబూజీ విద్యాలయం యాజమాన్యం తులసీరామ్, నాగార్జునబాబు జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: అండర్-14, 17 విభాగాల్లో జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 19న బాపట్ల జిల్లా చెరువు జమ్ములపాలెంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఎనిమిది మంది బాలికలు, ఐదుగురు బాలురు ప్రతిభ చాటారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞాన ప్రసూనాంబ, పీఈటీలు వాణిసునీల, వెంకట్ తదితరులు అభినందనలు తెలిపారు.

వైభవంగా గంగానమ్మ ఉత్సవాలు



గంగానమ్మకు అభిషేకం చేస్తున్న జగదీష్, రమేష్ కుటుంబ సభ్యులు

చిలువూరు(దుగ్గిరాల): చిలువూరులోని గంగానమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం రెండో రోజు ఘనంగా జరిగాయి. పొంగళ్లతో భక్తులు తరలి వచ్చారు. రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రంగిశెట్టి రమేష్, జగదీష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. హంస వాహనంపై అమ్మవారిని గ్రామంలోకి ప్రదర్శనగా తీసుకువచ్చారు. వేషధారణలు, వాయిద్యాల నడుమ ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు కొనసాగింది. సోమవారం అన్నదానం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కుంచనపల్లి(తాడేపల్లి), న్యూస్‌టుడే: మండలంలోని కుంచనపల్లిలో ఆదివారం మానవ సేవాసంస్థ నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరంలో 160 మందికి ఆరోగ్య సేవలు అందించారు. సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ నేతృత్వంలో రామ్ స్నేహ ఎవెన్యూ బహుళ అంతస్తుల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు శ్రీకర్, శశిధర్ పరీక్షలు చేసి మందులను అందజేశారు. వెంకటరెడ్డి, పరమేశ్వరి, సుబ్బారెడ్డి, హనుమాన్, రాజారెడ్డి పాల్గొన్నారు.

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం పెదపరిమిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 90 మంది స్థానికులు వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. 14 మందికి శుక్లాల ఆపరేషన్‌లు చేయాలని వైద్యులు సూచించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు సేవా భావం అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

తాడికొండ, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలతో విద్యార్థులకు సమాజ సేవా భావం పెరుగుతుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ జి.కరుణాసాగర్ తెలిపారు. మోతడక గ్రామంలోని విద్యార్థులకు, మహిళలకు విశ్వవిద్యాలయ కమ్యూనిటీ సైన్స్ విద్యార్థులు ఆరోగ్యమైన జీవనం అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. 60 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత, కౌమార విద్య, తక్కువ ఖర్చుతో పోషకాహార వంటలు, అవయవదానం ప్రాముఖ్యత, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి గ్రామస్థులకు వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్ చైతన్యకుమారి పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న కోదండ రామయ్య

మంగళగిరి, న్యూస్‌టుడే: పచ్చదనం, పరిరక్షణ సంస్థ ప్రతినిధులు ఆదివారం మంగళగిరి మిద్దె కూడలిలో వివిధ రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలు పంపిణీ ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చని సంస్థ ప్రతినిధి ఆకురాతి కోదండరామయ్య తెలిపారు. సభ్యులు వింజమూరి శ్రీనివాసరావు, రేఖా కోటేశ్వరరావు, రాజేష్, మాచర్ల వసుమతి, ఆకురాతి శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

నీరుకొండ(మంగళగిరి): మంగళగిరి మండలం నీరుకొండ ప్రాంతంలో ఈనెల 21 నుంచి 23 వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాల అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈఈ సురేష్‌బాబు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని 132 కేవీ పాత లైన్ కండక్టర్‌ను తొలగించి నూతన కండక్టర్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కోవెలమూడి(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మండలంలోని కోవెలమూడి గ్రామంలో 'పల్లె పండగ' కార్యక్రమం భాగంగా ఆదివారం ఉపసర్పంచి గడ్డం గంగాధరరావు రూ.10 లక్షల నిర్మించనున్న రెండు సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మన్నవ పూర్ణచంద్రరావు, పత్తి భావన్నారాయణ, నాగిసెట్టి నాగరాజు, కొలికొండ శ్రీనివాసరావు, పాతూరి కృష్ణారావు, కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

సదస్సు విజయవంతం చేయండి

కుంచనపల్లి(తాడేపల్లి): వ్యవసాయ సమస్యలపై విజయవాడలో ఈనెల 22వ తేది జరిగే సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు కోరారు. తాడేపల్లి మండలం కుంచనపల్లిలో ఆదివారం సాయంత్రం ఆయన రైతులను కలిసి చర్చించారు. నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి శివ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీ అమలు చేయాలి

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పొనుగుపాడులో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధించాలని తెలిపారు. రాజధాని పనుల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం సీఐటీయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మస్తాన్ వలి, మధు, రవి, రాము, ఫణీంద్ర, గోపి, సుశీలరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా లారింజెక్టమి శస్త్రచికిత్స

మంగళగిరి, న్యూస్‌టుడే: మండలంలోని చినకాకాని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏఓఐ)లో అత్యంత క్లిష్టమైన లారింజెక్టమి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ ఇస్సాంత్ ఐనపూరి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పునరావృత స్వరపేటిక క్యాన్సర్(వాయిస్ బాక్స్ క్యాన్సర్)తో బాధపడుతున్న 47ఏళ్ల వ్యక్తికి శస్త్రచికిత్సను నిర్వహించినట్లు తెలిపారు. గతంలో క్యాన్సర్ కారణంగా జరిగిన 9 నెలల రేడియేషన్ థెరపీ కారణంగా సమస్య వచ్చినట్లు తెలిపారు. శస్త్రచికిత్సలో భాగంగా రోగి వాయిస్ బాక్స్‌ను తొలగించడంతో పాటు మెడకు ఇరువైపులా నుంచి సోర కణుపులు, చుట్టూ ఉన్న కణజాలాన్ని తీసి వేసినట్లు తెలిపారు.

అవీ ఇవీ

'మహిళలకు రక్షణ కరవు'

తాడేపల్లి: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి అన్నారు. తాడేపల్లి మండలం కొలనుకొండలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కడప జిల్లా బద్వేల్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని ప్రేమ పేరుతో మోసం చేసి పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన ఆందోళన కలిగించిందని తెలిపారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించడం శుభ పరిణామమని, వాటిని అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రజలకు తెలపాలని కోరారు. ఇప్పటికే అత్యాచారాలు, వేధింపులు నివారణకు వర్మ కమిషన్ సూచనలు అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు

పట్టభద్రుల ఓటు నమోదు



వివరాలు నమోదు చేస్తున్న తెదేపా నాయకులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై ఆదివారం పెదపరిమి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 60 మంది డిగ్రీ, పీజీ చదివిన యువత ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామారావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, రాయపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం



కోటేశ్వరరావు (పాతచిత్రం)

కొర్నెపాడు(వట్టిచెరుకూరు): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కొర్నెపాడుకు చెందిన విద్యుత్తు శాఖ ఉద్యోగి ముత్తినేని కోటేశ్వరరావు (47) ఆదివారం మృతి చెందారు. ఈ నెల 19వ తేదీన కొర్నెపాడు ఉప విద్యుత్తు కార్యాలయంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో ప్రత్తిపాడు నుంచి గుంటూరు వెళుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని స్థానికులు గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. మన్నవ పూర్ణచంద్రరావు, ఏఈ రవితేజ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తెనాలి
•తెనాలి •పొన్నూరు

కన్వీనర్లు క్రియాశీలకంగా పనిచేయాలి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలసిన బాధ్యత, రక్షించుకోవాలసిన అవశ్యకత ఉందని సమరసత ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు విశదీకరించారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బోసురోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో నిర్వహించిన కొల్లిపర, తెనాలి మండలాల గ్రామ కన్వీనర్ల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఈ తరగతులకు తెనాలి ఖండ ప్రముఖ్ కడియాల సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు. హిందూ ధర్మ రక్షణలో గ్రామ కన్వీనర్లు క్రియాశీలకంగా పనిచేయాలని ఆయన సూచించారు. హనుమత్ ప్రసాద్, ఎ.వెంకటేశ్వరరావు, వి.సునీల్, ఎస్.రామారావు నేయలు, ఎం.పవన్‌రెడ్డి, కె.రవికుమార్ పాల్గొన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాలలో ఎమ్మెస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్ (వాటర్, ఎనర్జీ, ఆయిల్, గ్యాస్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని, ముందు వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రవేశాల విభాగం సంచాలకుడు డాక్టర్ బ్రహ్మాజీ చెప్పారు. బీఎస్సీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.20వేలు ఫీజు చెల్లించి కోర్సులో చేరాలన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

పొన్నూరు, న్యూస్‌టుడే: సంగం డెయిరీ పాడి రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించిందని సంగం డెయిరీ ఛైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. ఆదివారం చింతలపూడిలోని సంగం డెయిరీ పాల కేంద్రం వద్ద పాడి రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణ పరిధి రైలుపేటలోని వీధి దీపం వెలగడం లేదు. రాత్రి సమయంల్లో రాకపోకలు నిర్వహించడం చాలా ఇబ్బందికరంగా ఉంది. - పి.శంకర్
✔ వీధి దీపం బాగు చేయించే విధంగా చూస్తా.
- అవుర్డ్ సహాయ ఇంజినీర్
? వీవర్స్‌కాలనీలోని మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. వాటిని తొలగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలి. -సి.వరలక్ష్మి.
✔ వ్యర్థాలను తొలగించే విధంగా చూస్తా.
- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి
-న్యూస్‌టుడే, పొన్నూరు

అసంపూర్తి పనులు.. జనులకు అవస్థలు

వార్డులు	7,9,10
జనాభా	14,000



బీటీ రోడ్డుకు బదులు వెట్‌మిక్స్ వేసి వదిలేసిన పాలాద్రి కాలువ వెంట రోడ్డు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

పట్టణంలోని నాజర్‌పేట, కొత్తపేటలో నెలకొన్న సమస్యలతో జనం అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో వైకాపా ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు సగం సగం చేసి వదిలేశారు. మురుగు కాలువలు లేకపోవడం, పైపులు లీకులు సకాలంలో చేయకుండా తీవ్ర జాప్యం చేయడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు.

అనుసంధాన రోడ్డు మరచారు.. పాలాద్రి కాలువ పక్క, బీటీ రోడ్డు పనుల టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు వెట్‌మిక్స్ వేసి సరిపుచ్చారు. దీని మీదుగా రాకపోకలు సాగించలేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నాజర్‌పేట, గురవయ్యకాలనీ మధ్య అనుసంధానంగా వేసిన వంతెనకు అప్రోచ్ వేయడం విస్మరించడంతో నిరుపయోగంగా మారింది. ★ స్థానిక చిట్టి ఆంజనేయస్వామి ఆలయం నుంచి రామాలయం వరకు జంపని కాలువకు ఇరుపక్కల గోడలు నిర్మించారు. అక్కడి నుంచి ఇండియన్ గ్యాస్ గోడౌను వరకు గోడలు నిర్మించకుండా జాప్యం చేస్తున్నారు. ★ పులే కాలనీలోని మురుగునీటి శుద్ధి ప్లాంటు వద్ద జంపని కాలువలో చిన్న తూములు నుంచి మురుగు ముందుకు కదలడం లేదు. దీని వల్ల వర్షాపునీరు స్తంభించి పుట్టింలో రోడ్లు నీట మునుగుతున్నాయి. ★ బొంతారామయ్య కాలనీలోని సుగాలీ కుటుంబాలకు వీధి దీపాలు వేయాలని గత ఏడేళ్ల నుంచి కోరుతున్నా పట్టించుకున్న నాధుడు లేడు. ★ పట్టణ ప్రణాళిక అధికారులు నాజర్‌పేట టంకసాల, వంకమామిడి వీధిల్లో ప్లాను లేకుండా పోసిన పిల్లర్లను రాజకీయ ఒత్తిడితో ఆక్రమణలు తొలగించి సరిపెట్టారు. ★ పదో వార్డు సచివాలయం కూడలి, సంకారాధి కొట్ట సెంటర్లో వేగ నియంత్రికలు లేకపోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

రహదారులు ఛిద్రం.. కొత్తపేటలో శిథిలావస్థకు చేరిన పోలీసు క్వార్టర్లు, మున్సిపల్ కమిషనర్ బంగ్లాలో పెరిగిన పిచ్చిమొక్కలు చిట్టడవిని తలపిస్తున్నాయి. కోటీ చావిడి, నాయుడుగారి కుండ బిర్యాని, యడ్లపాటి వెంకట్రావ్‌సెంటర్లో సీసీ రోడ్లు ధ్వంసమయ్యాయి. వీటి మీదుగా రాకపోకలు సాగించే వారు తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. ఖిజన్ చౌక్ నుంచి చిన రావూరు వ్యాప్తి, వెళ్లే రోడ్లలో కాలువలపై ఆక్రమణలు వెలిశాయి. ఇటీవల బుర్రిపాలెం రోడ్డులో చేపట్టిన మురుగు కాలువల్లో పూడికతీత పనులు సందర్భంగా ఆక్రమణలు పూర్తి స్థాయిలో తొలగించకుండా వదిలేయడంతో వర్షపు నీరు స్తంభించి కాలువలోకి వెళ్లడానికి అవకాశం లేక రెండు గంటల పాటు రోడ్లు జలమయమవుతున్నాయి.

చెట్ల కొమ్మలు తొలగించాలి

నరసింహా స్వామి దేవాలయం ఎదురు బజార్‌లోని రోడ్డులో వీధి దీపాలు కనిపించకుండా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించడం లేదు. వీధి దీపాలు వెలుగుతున్నా చీకట్లు అలుముకున్నాయి. వీధి కుక్కలు వెంటపడి కరుస్తున్నాయి. రోజూ శుభ్రం చేయాల్సిన మురుగు కాలువలను ముగ్గు జులకు ఒకసారి చేస్తున్నారు. -కె.హరినాథ్‌బాబు, విశ్రాంత ఉద్యోగి నాజర్‌పేట

నిధులు మళ్లించారు

బొంతారామయ్య కాలనీకి వచ్చిన ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో ఆ వర్గాలు ఉంటున్న ఏరియాలో ఆరకొర పనులు చేశారు. ఇదే నిధులతో ఇతర వర్గాలు ఉంటున్న ఏరియాలో సీసీ రోడ్లు నిర్మించారు. -బొంత నారాయణ, రైతు, నాజర్‌పేట

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం


కఠెవరంలో అభివృద్ధి పనుల శిలాఫలక ఆవిష్కరణలో మంత్రి మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం తెనాలి మండలంలో రూ.1.25 కోట్ల ఉపాధి హామీ నిధులతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కొలకలూరు, ఖాజీపేట, కఠెవరం, ఎరుకలపూడి, సంగంజాగర్లమూడి, అంగలకుదురు తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు ప్రారంభం: నిర్మాణం పూర్తై రెండు సంవత్సరాలు గడిచినా ప్రజలకు అందుబాటులోకి రాని జగ్గడిగుంటపాలెం ఆర్వో ప్లాంటు విషయంపై ఈ ఏడాది మార్చి నెలలో 'నిర్మించి నిరుపయోగంగా వదిలేసి' పేరిట ఈనాడు కథనం ప్రచురించింది. స్పందించిన అధికారులు ఆ ప్లాంటును తిరిగి వినియోగంలోకి తీసుకురావటానికి పనులు చేపట్టారు. ఆ ప్లాంటును ఆదివారం మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు.

కొల్లిపర, న్యూస్‌టుడే: పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో రూ.25 లక్షలతో సీసీ రోడ్ల పనులకు ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. తెదేపా, జనసేన నేతలు ఆళ్లవీరారెడ్డి, యల్లమాటివెంకటరావు, పల్లిగంగాధర్, విస్సార్రప్పశ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్త మృతికి సంతాపం

మంచాల (చేబ్రోలు), న్యూస్‌టుడే: మండలంలోని మంచాలకు చెందిన తెదేపా సీనియర్ కార్యకర్త, సంఘ పెద్ద ఏకసిరి సుబ్బయ్య(90) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ సుబ్బయ్య మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కశ్మీర్ యువతకు ఘన స్వాగతం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కశ్మీర్ యువతకు ఘన స్వాగతం లభించింది. భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ, గుంటూరు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు 4వ కశ్మీర్ యూత్ ఎక్చేంజ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు కశ్మీర్‌లోని వివిధ జిల్లాలకు చెందిన 132 మంది యువతీ, యువకులు ఆదివారం ఏఎన్‌యూకి చేరుకున్నారు. వీరికి నెహ్రూ యువ కేంద్రం అధికారులు ఘన స్వాగతం పలికారు. సోమవారం నుంచి అధికారికంగా కార్యక్రమాలను ప్రారంభించనున్నామని నెహ్రూ యువకేంద్రం అధికారిణి కిరణ్మయి తెలిపారు.

24 నుంచి మహాదేవుని మహిమ పండుగలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మహాదేవుని మహిమ పండుగలు 24వ తేదీ నుంచి 27 వరకు ఇస్లాంపేట యేసయ్య ప్రార్థన మందిరంలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఆనందన్న ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.

అభినందన

తెనాలి(కొత్తపేట): తెనాలికి చెందిన కూచిపూడి నృత్య గురువు ఆరాధ్యుల ప్రజ్ఞ శిష్య బృందం ఆదివారం ద్వారకా తిరుమల ఆలయంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నృత్య గురువు, కళాకారిణులను అభినందించారు. ఈ వివరాలను ఆమె ప్రకటనలో తెలిపారు.

ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దు

కొవెలమూడి(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సమాచారం ఎవరికీ చెప్పవద్దని గుంటూరు దక్షిణ మండల డీఎస్పీ మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొవెలమూడి గ్రామంలో పోలీసు శాఖ నిర్వహించిన పోలీసు వారధి అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పొదుపు మహిళలను బెజుటూ కొందరు దగ్గరకు వచ్చే వారిని నమ్మవద్దని తెలిపారు. ఓటీపీలు పక్క, వారికి పంచుకోవద్దని సూచించారు. మహిళలు వేలిముద్రలు గురికావద్దని, పోలీసులను ఆశ్రయించాలని పేర్కొన్నారు.

విలువల పెంపులో తల్లిదండ్రుల పాత్ర కీలకం


సత్కారం అందుకుంటున్న మానసిక నిపుణుడు సుబ్బారావు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పిల్లలు, యువతలో నైతికత, మానవత్వ విలువలు పెంపొందించడంలో తల్లిదండ్రులు, పెద్దలు ముఖ్య పాత్ర వహించాలని మానసిక నిపుణుడు, వక్త ప్రత్యూష సుబ్బారావు సూచించారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి సంస్థ ఛైర్మన్ కొలసాని రాంచంద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మొవ్వ భవాని జ్ఞాపకార్థం రూ.55వేలు మానవత సంస్థ ద్వారా వైద్యవిద్య నభ్యసిస్తున్న షేక్ బాబా షరీఫ్‌కు అందజేశారు. తొలుత దివంగత రతన్‌టాటా చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంస్థ రీజనల్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, ఆసీ అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, టి.శ్రీనివాసబాబు, పి.వెంకట్, పి.వాసు, డి.సోమయ్య, ఎస్.వి.శర్మ, దాతలు మొవ్వ సాంబశివరావు, హేమంత్ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని గుంటూరు, కృష్ణ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి లగడపాటి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం పొన్నూరు ప్రైవేటు భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వర్గాల సమస్యలను పరిష్కరించే నేతను ఎన్నుకోవాలని కోరారు. గత పాలకవర్గాలు శాసన మండలి ఏర్పాటు చేసిన అనంతరం ప్రజా సమస్యలను పరిష్కరించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు పది అంశాలతో కూడిన మేనిఫెస్టోను ఆయన విడుదల చేశారు.

స్నేహితులు పరస్పరం గౌరవించుకోవాలి


ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు మొక్కను అందజేస్తున్న పూర్వపు విద్యార్థులు

పొన్నూరు, న్యూస్‌టుడే: స్నేహితులు పరస్పరం గౌరవించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పూర్వపు విద్యార్థి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. చింతలపూడిలో మాజీ మంత్రి, దివంగత ధూళిపాళ్ల వీరయ్య చౌదరి కల్యాణ మండపంలో ఆదివారం నిడుబ్రోలు జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో విద్య అభ్యసించిన 1982 సంవత్సరానికి చెందిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక సామర్థ్యం ఉంటుందని, ఒక్కరూ ఎక్కువ, మరొకరు తక్కువ కాదని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా స్నేహితులకు అవసరమైన సమయంలో అండగా ఉంటానని తెలిపారు.

పూర్వపు విద్యార్థుల ఆదర్శం


ఏవీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు 108 మంది పూర్వపు విద్యార్థులు నేత్ర దానం చేస్తూ ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. పూర్వపు విద్యార్థి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మెదటి సంతకం చేసి పత్రాలను అందజేశారు.

ఎస్‌పీఎఫ్ క్రీడలు ప్రారంభం


క్రీడలను ప్రారంభిస్తున్న ఐజీ బీవీ రామిరెడ్డి

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఎస్‌పీఎఫ్) 33వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సిబ్బందికి ఆటల పోటీలు ఎస్‌పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి ప్రారంభించారు. ఈనెల 23వరకు ఈ పోటీలను నిర్వహించనున్నారు. మొదటి 100మీటర్ల పరుగు పందెంలో వక్కపట్ల, రంజిత్ కుమార్, 400 మీటర్ల పరుగు పందెంలో పెంటయ్య, నారాయణరావు, మహేష్ వరుస విజయం సాధించారు. ఈ సందర్భంగా ఐజీ రామిరెడ్డి మాట్లాడుతూ పోటీల వల్ల సిబ్బంది ఐక్యత, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కమాండెంట్ శంకర్‌రావు, ఏసీలు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, కృష్ణమాచారి, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేత బాపట్ల సైన్స్ కళాశాల


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సైన్స్ కళాశాల వీరయ్య తదితరులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆదివారం అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఏఎన్‌యూ వ్యాయామ, ఇంజినీరింగ్, ఆర్‌వీఆర్ జేసీ, బాపట్ల ఇంజినీరింగ్, సైన్స్ అండ్ ఆర్ట్స్, ధన లక్ష్మీ వ్యాయామ, జేకేసీ కళాశాలల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను సీడీఈ సంచాలకుడు ఆచార్య వెంకటేశ్వర్లు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ వీరయ్య, వ్యాయామ విభాగం సంచాలకుడు ఆచార్య పాల్‌కుమార్ ప్రారంభించారు. బాపట్ల సైన్స్, ఆర్ట్స్ కళాశాల ప్రథమ, ఆర్‌వీఆర్ జేసీ కళాశాల, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఏఎన్‌యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వీరయ్య బహుమతులు అందజేశారు.

గంజాయి నిందితుడి పట్టివేత

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ కబేళా వంతెన వద్ద నీలం సాయితేజ అనే వ్యక్తి వద్ద ఆదివారం 1 కేజీ 135 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న వన్‌టౌన్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

యువకుడి మృతదేహం లభ్యం


రవీంద్ర (పాత చిత్రం)

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని సంగంజాగర్లమూడి వద్ద కాలువలో శవం తేలిన ఘటనలో గుంటూరుకు చెందిన బీటెక్ విద్యార్థి జి.రవీంద్ర(19) మృతదేహం ఆదివారం కాకుమాను మండలంలో లభించిందని తెనాలి గ్రామీణ పోలీసులు ఆదివారం తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బిడ్డకు మంచి భవిష్యత్తు ఉంటుందని చదివిస్తున్న తల్లి అంతమ్మ కుమారుడి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. కుటుంబ సభ్యుల ఆవేదన చూపురుల కంట తడి పెట్టించింది.

సమతుల్య ఆహారంతోనే మానసిక ప్రశాంతత


సదస్సు సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధర్ తదితరులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: సమతుల్య ఆహారంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వీసీ గంగాధర్ అన్నారు. ఏఎన్‌యూలోని సైకాలజీ విభాగం, ఏపీఏ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం పని ప్రదేశంలో ఆరోగ్యంపై సదస్సు నిర్వహించారు. వీసీ గంగాధర్ మాట్లాడుతూ పనిప్రదేశంలో మానసిక ఆధ్యాత్మిక అంశాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ వీరయ్య మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యాలకు అవినాభావ సంబంధం ఉందన్నారు. సైకాలజీ విభాగాధిపతి ఆచార్య చెన్నారెడ్డి, మానసిక వైద్యులు నీలి ఉమా మాట్లాడారు. అనంతరం సదస్సు సావనీర్‌ను వీసీ గంగాధర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఏ ప్రతినిధులు జాన్సి రాజేశ్వరి, లహరి, డాక్టర్ అయోధ్య, ఆచార్య టీడీ విమల, డాక్టర్ గంగాధర్, డాక్టర్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీల రహస్య సమావేశం

పొన్నూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో ఆ పార్టీ మహిళా నేతలు, మెప్మా అధికారులు, ఆర్పీలు కుమ్మక్కై బీనామీ పేరులతో కోట్లాది రూపాయలను స్వాహా చేశారు. అవినీతి ఆక్రమాలు వెలుగులోకి రావడంతో ముగ్గురు అధికారులను రాష్ట్ర మెప్మా ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. బ్యాంకుల నుంచి ఎస్‌హెచ్‌వోలు తీసుకుంటే బినామీ రుణాలు తీసుకునే వెసులుబాటు ఉండడని ఆలోచనతో ఆక్రమాలకు పాల్పడిన ఆర్పీలు అబ్బరికలాం రోడ్డులోని ఓ అర్పీ ఇంట్లో శనివారం రాత్రి ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఎస్‌హెచ్‌వోల పత్రాలపై చర్చ కొనసాగింది.

తాగునీరు కలుషితం

చేబ్రోలులో సమస్యలు ఎన్నో..

వార్డులు	20
జనాభా	30 వేలు


ప్రధాన రహదారిలో సంచరిస్తున్న వీధి కుక్కలు

చేబ్రోలు, న్యూస్‌టుడే: మండల కేంద్రం చేబ్రోలు కాలనీల్లో ప్రధానంగా తాగునీరు, వీధి కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. గత వైకాపా పాలనలో నిర్లక్ష్యం కారణంగా సమస్యలు పరిష్కారం కాలేదు. ★ కోట్లాది రూపాయలు వెచ్చించి గతంలో తాగునీటి పథకం నిర్మించినా కలుషిత నీరు సరఫరా అవుతోంది. వీధుల్లో ఎక్కువ శాతం మురుగు నీటి కాల్వల్లోనే పైపు లైన్ల నిర్మాణం చేశారు. పైపు లైనుకు లీకు ఏర్పడి మురుగు మంచినీటిలో కలుస్తోంది. ఒక్కో సారి తాగునీటి కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తోంది. ఆ నీటిని వినియోగించడం వల్ల చర్మ, ఇతర అంటువ్యాధులు సంక్రమిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ★ ప్రధాన రహదారులతో పాటు అన్ని కాలనీల్లో కుక్కలు, పాతరెడ్డిపాలెం, కొత్తరెడ్డిపాలెంలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. వీధికుక్కలు పెద్ద సంఖ్యలో సంచరిస్తూ దాడి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో వాహనదారులను వెంబడిస్తున్నాయి. ఇటీవల ఓ ద్విచక్రవాహనంపై వెంటపడటంతో ఇద్దరు కిందపడి గాయాలపాలయ్యారు. కోతుల దాడులు అధికకే కొంత మంది రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ఎకరాకు రూ.70 వేలు వెచ్చించి సౌర విద్యుత్తు తీగలను ఏర్పాటు చేసుకున్నారు. గడిచిన మూడు నెలల వ్యవధిలో 42 మంది కుక్కకాటుకు గురికాగా.. 50 మంది వరకు కోతుల దాడికి గురై చేబ్రోలు వైద్యశాలకు వచ్చినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల జరిగిన మండల పరిషత్తు సమావేశంలో కోతులను పట్టించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు పట్టుబట్టారు.


మురుగు కాలువలో తాగునీటి పైపు లైను

★ ఇళ్ల మధ్య వినియోగంలో లేని ఖాళీ స్థలాలు 350 వరకు ఉన్నట్లు ఇటీవల పంచాయతీ అధికారులు గుర్తించారు. వాటిల్లో పిచ్చి చెట్లు విపరీతంగా పెరిగాయి. చుట్టు పక్కల వాళ్లు చెత్త, వినియోగించిన ప్లాస్టిక్ వస్తువులు, తాగేసిన కొబ్బరి బొండాలు పడేయడం వల్ల వాటిల్లో నీళ్లు నిలిచి దోమలకు, విషసర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. గడిచిన ఏడేళ్ల కాలంలో ముదురు కాలువల్లో ఖాళీ స్థలాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేసిన దాఖలాలు లేవు.

చర్యలు తీసుకుంటాం

న్యూస్‌టుడేకు వివరణ ఇస్తూ.. పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం


తెనాలి రైల్వేస్టేషన్‌లో పట్టాల నడుమ వర్షం నీరు


నెహ్రూ రోడ్డు, రజక చెరువు మలుపులో..


కొల్లిపరలో..

తెనాలి టౌన్, కొల్లిపర, న్యూస్‌టుడే: తెనాలిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగింది. ఈ తీరు వల్ల ప్రధాన రోడ్లతో పాటు ఉప వీధులు సైతం జలమయం అయ్యాయి. ★ కొల్లిపరలో కురిసిన భారీ వర్షంతో మురుగు కలసి రోడ్లపైకి చేరి రహదారులు దర్గందభరితంగా మారాయి. మురుగునీటి కల్వల నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వీనుల విందుగా సంగీత విభావరి


సత్కారం అందుకుంటున్న సాయిలక్ష్మీరాజు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రముఖ నటులు సంగమూరి బాల కృష్ణ నట స్వర్ణోత్సవ సందర్భంగా స్వరలయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. పలువురు గాయనీ, గాయకులు బాలకృష్ణ నటించిన పలు చిత్రాల్లోని పాటలను ఆలపించారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్ష్మి రాజు ప్రతి పాటను వివరించారు. గాయనీ, గాయకులను సభికులకు పరిచయం చేశారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ సీతావే డి.సుబ్రహ్మణ్యం, గాయకుడు బొల్లు గోపాలకృష్ణ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించండి


ప్రయాణికులతో మాట్లాడుతున్న చిలకా విజయ్‌కుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు ఉచిత సౌకర్యం కల్పించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పొన్నూరు ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని పొన్నూరులో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని వెల్లడించారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు



నారాకోడూరు (చేబ్రోలు), న్యూస్‌టుడే: ఆటో బోల్తా పడి.. ఐదుగురు గాయపడిన ఘటన నారాకోడూరులో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సంగంజాగర్లమూడి నుంచి ఆటో ప్రయాణికులతో గుంటూరు వెళ్తుండగా నారాకోడూరు సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీ కొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సంగంజాగర్లమూడికి చెందిన గోపి, సామ్రాజ్యం, గురవపాలెంకి చెందిన అనూష మరో ఇద్దరు గాయపడటంతో 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుంటూరు పశ్చిమ

కృష్ణమూర్తి పద్య కవిత్వం విశేషమైనది


మేడిసెట్టి సుభద్రా కృష్ణ, దేవికా రాణిని సత్కరిస్తున్న రంగారావు తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే : కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన చిటిప్రోలు కృష్ణమూర్తి పద్య కవిత్వం విశేష ప్రతిభతో కూడుకున్నదని సాహితీవేత్త డాక్టర్ వెంకటరత్నం అన్నారు. గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం అమరావతి సాహితీ మిత్రులు నిర్వహించిన సాహిత్య సభలో ఆయన చిటిప్రోలు కృష్ణమూర్తి రచించిన పురుషోత్తముడు పద్య కావ్యంలోని పాత్ర చిత్రణ గురించి ప్రసంగించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు సభకు అధ్యక్షత వహించారు. దేవికా రాణి రత్నాకర్ (తెనాలి) ఈ మాసం కవిగా పాల్గొని నాన్న, పర్యావరణం, అవినీతి వ్యతిరేకత తదితర అంశాల మీద కవితలు వినిపించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో చల్లా సత్యవతి (పిడుగురాళ్ల), కె. విజయ సారథి బాబు, గోలి హనుమత్ శాస్త్రి, సొపాటి ప్రభాకర్, మేడిసెట్టి సుభద్రా కృష్ణ తదితర కవులు పాల్గొన్నారు. నిక్కచ్చి కవిత బహుమతి గ్రహీత మేడిసెట్టి సుభద్రా కృష్ణను, ఈ మాసం కవిగా పాల్గొన్న దేవికా రాణిని పలువురు సత్కరించారు.

ఆలపాటికి బ్రాహ్మణ సేవా సమాఖ్య మద్దతు

పట్టాభిపురం, న్యూస్‌టుడే : కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ తెదేపా అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు లక్ష్మీపురంలోని ఎన్నికల కార్యాలయంలో రాజేంద్రప్రసాద్‌ను ఆయన కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం కృషి చేస్తామన్నారు. ఓట్ల నమోదుకు శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

రామిరెడ్డినగర్.. సమస్యలతో సతమతం

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే


శ్రీరామ్‌నగర్ 1వ లైన్‌లో అసంపూర్తి రహదారి


రెడ్డి కాలేజి ఎదురుగా ఖాళీ స్థలంలో ఇలా..


రామిరెడ్డి నగర్‌లో అధ్వానంగా మురుగు కాలువ

పశ్చిమ నియోజకవర్గ 29వ డివిజన్ పరిధిలోని రామిరెడ్డినగర్, మల్లారెడ్డినగర్ ప్రాంతాల్లో వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో కార్మికులు, ఉన్నత వర్గాల ప్రజలు నివాసం ఉంటున్నారు. విద్యా సంస్థలతోపాటు ఆలయాలు, ప్రార్థనా మందిరాలు ఉన్నాయి. ఇంతటి కీలకమైన ప్రాంతంలో మౌలిక సదుపాయాలు లేవు. కొన్ని ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మురుగు కాల్వలు లేకపోవడంతో నిత్యం నరకం చూస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేక తీవ్రమైన దుర్వాసన వస్తోంది. దోమల బెడదతో అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా శ్రీరామ్‌నగర్ 1వ లైన్‌లో సైడ్ కాల్వలు నిర్మించారు. రహదారి పనులు మధ్యలోనే ఆపివేశారు. రామిరెడ్డినగర్, మల్లారెడ్డి నగర్ ప్రాంతంలో మురుగు కాల్వల్లో పూడిక తీయకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసింది. ఆయా ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

రూ.96 లక్షలతో ప్రహరీ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే : సర్వజనాసుపత్రి బొంగరాలబీడులో ప్రభుత్వం కేటాయించిన 6 ఎకరాల భూమి రక్షణ కోసం రూ.96 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. నగరపాలకసంస్థ కమిషనర్ శ్రీనివాస్ ఇతర అధికారులతో కలిసి ఆదివారం ఆ స్థలాన్ని పరిశీలించిన అనంతరం విలేకరులతో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీజీహెచ్‌కు కేటాయించిన స్థలం హద్దులు గుర్తించి, చెత్త తొలగించగానే నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు కేవీఎల్‌ఎన్ మూర్తి, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు తదితరులున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ జయరాంప్రసాద్

పట్టాభిపురం, న్యూస్‌టుడే : హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు పశ్చిమ వలయ డీఎస్పీ జయరాంప్రసాద్ హెచ్చరించారు. లక్ష్మీపురంలోని ఓ హోటల్‌లో హోటళ్లు, లాడ్జిలు, గెస్ట్‌హౌస్‌ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. సందర్శకుల వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, అరండల్‌పేట సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే : ఆరోగ్యం.. అనారోగ్యం అనేవి చాలా వరకూ మన ఆహారంతోనే ముడిపడి ఉంటాయని డాక్టర్ నీరెన్ రావెల సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో నీరెన్ మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన తిండి తినాలన్నారు. తక్కువ ఖరీదులో దొరికే చాలా పదార్థాల్లో కూడా మంచి పోషకాలు ఉంటాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులున్నారు.

హిందూ సంఘాల నిరసన



గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే : తెలంగాణలోని సికింద్రాబాద్‌లో ఇటీవల చోటు చేసుకున్న ఘటనలను నిరసిస్తూ ఆదివారం గుంటూరు నగరంలో హిందూ హెరిటేజ్, హిందూ సంఘాలు, భాజపా కార్యకర్తలు స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో ఆందోళన చేశారు. శంకర్‌విలాస్ నుంచి ర్యాలీగా బయలుదేరి అమరావతి రోడ్డులోని వివేకానంద విగ్రహం వరకు వెళ్లారు. హిందూ సంఘాల నాయకుడు చల్లా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తక్షణమే తెలంగాణ ప్రభుత్వం హిందువులకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో తుంగ యశ్వంత్, కె.హర్ష, తూనుగుంట్ల రాజేష్, సాయి, ప్రవీణ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'సనాతన ధర్మ పరిరక్షణ అంటే వ్యవస్థను పరిరక్షించడమే'

బ్రాడీపేట, న్యూస్‌టుడే : సనాతన ధర్మ పరిరక్షణంటే కుల వ్యవస్థను పరిరక్షించడమేనని విరసం సీనియర్ నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ సమావేశ మందిరంలో డాక్టర్ అంబేడ్కర్, జాషువా, ఫులే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సనాతన ధర్మం-రాజ్యాంగం' అనే అంశంపై సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విరసం సీనియర్ నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రకారం స్త్రీని అత్యంత తక్కువస్థాయిలో ఉంచడమేనన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో సనాతన ధర్మం పనికి రాదన్నారు. కులం అడ్డుగోడలను ధ్వంసం చేసి నూతన సమాజాన్ని నిర్మించాలన్నారు. విద్యార్హతలను బట్టి వృత్తులు ఉండాలేతప్ప వంశపార్యపరంగా ఉండకూడదన్నారు. సభకు కవి బి.విల్సన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సాధు మాల్యాద్రి, వైకే, కె.జయసుధ, కనకపల్లి వినయ్, ప్రభుదాస్, అనిల్‌బాబు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఒకేషనల్ విద్యాశాఖలో అడ్డగోలు పదోన్నతులు'

అరండల్‌పేట, న్యూస్‌టుడే : ఒకేషనల్ విద్యాశాఖలో అడ్డగోలు పదోన్నతులు ఇస్తున్నారని, వాటిని ప్రభుత్వం వెంటనే అరికట్టి అర్హులకు పదోన్నతులు కల్పించాలని ఏపీ ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఆదివారం గుంటూరు ఏపీ ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకేషనల్ ఇంటర్ విద్యాశాఖలో నాన్‌టీచింగ్ సిబ్బందికి 25శాతం పదోన్నతులు అక్రమంగా జరుతున్నాయన్నారు. పదోన్నతుల అంశంపై న్యాయస్థానంలో వివాదం నడుస్తున్నప్పటికీ ఒక్కో పదోన్నతికి రూ.3 లక్షలు వసూలు చేసి, పదోన్నతులు కల్పిస్తున్నారని ఆరోపించారు. జీవో నం 302 ప్రకారం నాన్‌టీచింగ్ కోటా నుంచి ప్రమోషన్ పొందేది 10 శాతం మాత్రమేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

మొండి జబ్బులకు నివారణ ఆయుర్వేద వైద్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే : దీర్ఘకాలంగా వేధిస్తున్న మొండి వ్యాధులను సైతం నివారించే శక్తి ఆయుర్వేద వైద్యానికి ఉందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఫామ్ స్ప్రింగ్స్‌లో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు నిదర్శనం గ్యార్మీ పండగ

పట్టాభిపురం, న్యూస్‌టుడే : ఐకమత్యానికి గ్యార్మీ పండగ నిదర్శనమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. మొహిద్దిన్‌పాలెం దర్గా వద్ద జరిగిన గ్యార్మీ పండుగ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలసి దువా నిర్వహించారు. అన్నదానం చేశారు.

వరద బాధితులకు తక్షణమే సాయం చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద వీసీకే పార్టీ నాయకులు, బాధితుల నిరసన

బ్రాడీపేట, న్యూస్‌టుడే : వరదలో సర్వం కోల్పోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణే సాయం చేయాలని వీసీకే పార్టీ(విముక్తి చిరుతల కక్షి)రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కె.జయసుధ కోరారు. ఆదివారం స్థానిక లాడ్జి కూడలిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద వరద బాధితులతో కలిసి వారికి తక్షణం సాయం చేయాలని వీసీకే పార్టీ తరఫున ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కె.జయసుధ మాట్లాడుతూ రెండు నెలల కిందట కురిసిన భారీ వర్షాలకు విజయవాడ తోపాటు గుంటూరులో పేదలు నివసించే లోతట్టు ప్రాంతాలైన కాకుమానువారితోట, ఆనందపేట, వల్లూరువారితోట, చంద్రబాబు నాయుడుకాలనీ, బొంగరాలబీడు ప్రజలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కొందరికే పరిహారం అందిందని, మిగిలిన బాధితుల పేర్లు నమోదు చేయడంలో సచివాలయ సిబ్బంది తాత్సారం చేశారని విమర్శించారు. బాధితులకు సాయం అందించాలని సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సిహెచ్ వాసు, పాగళ్ల ప్రకాష్, పి.రమణయ్య, డెన్నిస్‌రాయ్, సాంబశివరావు, బాధితులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఉమ్మనేని రంగారావు


ఉమ్మనేని రంగారావు చిత్రపటం దగ్గర నివాళులర్పిస్తున్న అతిథులు, కుటుంబ సభ్యులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే : బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళా వేదికపై ఆదివారం రాత్రి డాక్టర్ ఉమ్మనేని రంగారావు ప్రథమ వర్ధంతి, సంస్మరణ సభ నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య మాట్లాడుతూ చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సుదీర్ఘ కాలం ప్రిన్సిపల్‌గా, డైరెక్టర్‌గా డాక్టర్ రంగారావు చేసిన సేవలు ఆదర్శప్రాయమన్నారు. ఆయన నాటికలు, కళలు, సంస్కృతి, తెలుగుదనం అంటే ఎంతో ఇష్టపడేవారన్నారు. ప్రముఖ రంగ స్థల చలన చిత్ర నటుడు మల్లాది భాస్కర్ మాట్లాడుతూ రంగారావు జ్ఞాపకంగా ఆయన కుటుంబ సభ్యులు గుంటూరు హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో 115వ హాస్య వల్లరి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సభకు గుంటూరు హ్యూమర్ క్లబ్ అధ్యక్షుడు జంపని కిషోర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మల్లాది క్రియేషన్స్, హైదరాబాద్ వారి చీకట్లో చంద్రుడు నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో గుంటూరు హ్యూమర్ క్లబ్ కార్యదర్శి అత్తలూరి నాగజ్యోతి, వ్యవస్థాపక కార్యదర్శి లాల్ వజీర్, రంగారావు కుటుంబ సభ్యులు ఉమ్మనేని శివనాగేశ్వర రావు, ఉమ్మనేని వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి


హాసినికి చెక్కు అందజేస్తున్న సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్, జీవీ రాయుడు

పట్టాభిపురం, న్యూస్‌టుడే : భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి పతకాలు కైవసం చేసుకోవాలని కమ్మజన సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్ పిలుపునిచ్చారు. జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పసిడి పతకం సాధించిన క్రీడాకారిణి పాపసాని హాసినిని ఆదివారం అభినందించారు. రూ.50,000 ప్రోత్సాహక నగదు బహుమతిని విశ్రాంత ప్రిన్సిపల్ జీవీ రాయుడు చేతుల మీదుగా అందజేశారు. సంయుక్త కార్యదర్శి మద్రిపూడి సీతారామయ్య, సభ్యులు రాయపాటి గోపాలకృష్ణ, ఘంటా పున్నారావు, పెద్ది సాంబశివరావు, గౌరవ సలహాదారు కన్నెగంటి బుచ్చయ్య చౌదరి తదితరులున్నారు.

క్రీడాకారులకు సాయం అందజేత

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే : జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పోటీల్లోనూ పతకాలు సాధించాలని ప్రవాస భారతీయులు, ఫ్యాంగ్‌టెక్ టెక్నాలజీస్ అధినేత జిల్లెళ్లమూడి వెంకట్ పిలుపునిచ్చారు. ఇటీవల ఏఎన్‌యూలో జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారుల్ని లక్ష్మీపురంలోని ఫ్యాంగ్‌టెక్ టెక్నాలజీస్ కార్యాలయంలో అభినందించారు. ఈ నెల 25 నుంచి 29 వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ జూనియర్ అథ్లెటిక్స్‌లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం అందజేశారు. ఎన్నారై కొల్లా అశోక్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, అంకాల సుబ్బారావు, అరుణ్‌కుమార్, శిక్షకులు రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఆహార సరఫరా వ్యక్తులపై దాడి

నగరంపాలెం(గుంటూరు), న్యూస్‌టుడే: జీజీహెచ్‌లో డైట్ సెక్షన్ నిర్వహిస్తున్న యువకులపై పూర్వ ఉద్యోగి అకారణంగా ఆదివారం 11గంటలకు దాడి చేశాడు. డైట్ సెక్షన్‌లో ఉన్న యువకులను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. సీసీ కెమెరాలు ఉన్నా దాడి చేయడం ఆస్పత్రి వర్గాలను కలవరపెడుతోంది. జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా సోమవారం కమిటీ వేసి పరిశీలిస్తామన్నారు.

గుంటూరు తూర్పు

పోషకాహారంతోనే ఆరోగ్యం

గుంటూరు వైద్యం: ఆరోగ్యం.. అనారోగ్యం అనేవి చాలా వరకూ మన ఆహారంతోనే ముడిపడి ఉంటాయని డాక్టర్ నీరెన్ రావెల సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో నీరెన్ మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన తిండి తినాలన్నారు. తక్కువ ఖరీదులో దొరికే చాలా పదార్థాల్లో కూడా మంచి పోషకాలు ఉంటాయన్నారు. పోషకాహారంపై అవగాహన పెంచుకుని, అందుబాటులో ఉన్న మంచి పదార్థాలన్నింటినీ తినడం మంచిదన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 40, వంగ 22, బెండ 24, పచ్చిమిర్చి 39, కాకర 32, క్యారెట్ 48, క్యాలిఫ్లవర్ 38, క్యాబేజీ 28, బీర 28, దొండ 24, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 35, గోరుచిక్కుళ్లు280, దోస 32, పొట్ల 30, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 84, చామదుంప 40, మునగ రూ.8, గోంగూర 10, తోటకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 39, కీర 24, క్యాప్సికం 64, అల్లం 60, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7 **-న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

? స్థానిక పొన్నూరురోడ్డులో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. ఈ ప్రాంతంలో కొందరు షాపుల నిర్వాహకులు తమ వాహనాల్ని రోడ్డుకు ఇరువైపుల నిలుపుదల చేస్తున్నారు. **- అన్వర్ భాషా, చౌత్రాసెంటర్**

✔ ఆ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. **- అశోక్‌కుమార్, తూర్పు విభాగపు ట్రాఫిక్ సీఐ**

? కొండయ్యకాలనీలోని విద్యుత్తు నియంత్రిక నుంచి తరచూ నిప్పు రవ్వలు వస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదు. **- కిషోర్, మారుతీనగర్**

✔ నియంత్రికకు మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **-మస్తాన్- ఏఈ**

? బాలాజీనగర్‌లో కొద్దిరోజుల నుంచి శానిటరీ సిబ్బంది వ్యర్థాల్ని తొలగించటం లేదు. వాటి నుంచి వచ్చే దుర్వాసన కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. **- శ్రీనివాసరావు, పాతగుంటూరు**

✔ వ్యర్థాల్ని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం **- ఐజాక్ -శానిటరీ ఇన్‌స్పెక్టర్.** -న్యూస్‌టుడే, పట్నంబజారు

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం


పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ వరప్రసాద్, అవోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం

పట్నంబజారు, న్యూస్‌టుడే : పేదల ఉన్నతికి ఆర్యవైశ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని 35వ డివిజన్ కార్పొరేటర్ ఈ.వరప్రసాద్ అన్నారు. ఆర్య వైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పట్నంబజారులోని సంస్థ కార్యాలయంలో 108 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పింఛన్లు, నిత్యావసర సరకుల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈరంటి వరప్రసాద్ మాట్లాడుతూ.. ఈ తరహా సేవల్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డాక్టర్ చింతా రామకృష్ణ, అవోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం, శ్రీమన్నారాయణ, రాధాకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఒత్తిడి అధిగమించాలి


ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నగరపాలకసంస్థ: క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొని మానసిక ఒత్తిడి అధిగమించాలని ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ హాల్‌లో ఆదివారం జిల్లా శాఖ నిర్వహించిన పోటీల్లో విజేతలైన వారికి బహుమతి ప్రదానం నిర్వహించారు. సభకు జిల్లాశాఖ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్‌లు మాట్లాడుతూ... అన్ని జిల్లాల్లో క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వచ్చే జనవరిలో కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ సంబరాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్, రాష్ట్ర ప్రచురణల కమిటి ఛైర్మన్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

గంజి బజారు.. సమస్యలతో బేజారు

పట్నంబజారు, న్యూస్‌టుడే

లాలాపేట గంజిబజారు ప్రాంతవాసులు ఇరుకురోడ్లు, ట్రాఫిక్, తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసిన సందర్భాల్లో గంజిబజారు లోతట్టు ప్రాంతం కావడంతో రెండు రోజులపాటు నీరు నిలిచి అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యక్తులు చేసేదేమి లేక తమ ఇళ్లను వదిలి వేరే ప్రాంతాల్లో అద్దెకు వెళ్తున్నారు.


ఇటీవల కురిసిన వర్షాలకు చేరిన మురుగు


రోడ్డుకు ఇరువైపులా నిలిపిన వాహనాలు

రాకపోకలు ఎలా..

గంజిబజారు చుట్టు పక్కల చిన్నపాటి రోడ్లు ఉండడం.. వాటిని ఆనుకుని కాలువలు ఉండడంతో వర్షాలు కురిసిన సందర్భాల్లో ఇటుగా రాకపోకలు చేసే వారు ప్రమాదవశాత్తు సైడు కాలువల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఈ ప్రాంతంలో నిలుస్తున్న వర్షపునీటి సమస్య గురించి స్థానికులు ఇటీవల ఎమ్మెల్యే నసీర్ దృష్టికి తీసుకెళ్లగా కార్పొరేషన్ అధికారులు ఇక్కడికి వచ్చి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయినా వర్షాలు కురిసిన వారం రోజుల వరకు బురదను తొలగించడానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు చేసేది లేక అందులోనే రాకపోకలు చేస్తున్నారు.


గంజిబజారులో ప్రమాదకరంగా మారిన గుంతలు

ట్రాఫిక్‌తో ఇబ్బంది...

లాలాపేట చుట్టు పక్కల ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలు అధికంగా ఉండడంతో ఇక్కడికి వచ్చే వారు రోడ్డుకు ఇరువైపుల వాహనాల్ని నిలుపుదల చేయడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. సెల్లార్లల్లో వాహనాలు నిలుపుదల చేయకుండా రోడ్లపై ద్విచక్ర వాహనాల్ని నిలపడం వల్ల ఈ దుస్థితి ఏర్పడుతుందని లాలాపేట ప్రాంతవాసులు తెలిపారు. అధికారులు స్పందించి తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల చర్యలు శూన్యం



లాలాపేట గంజిబజారు చుట్టు పక్కల ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వర్షపునీరు చేరుతుంది. దాదాపు 20 ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో ఇదే సమస్య ఉన్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. వర్షాలు పడినప్పుడు సైడు కాలువల్లోని నీరు ఇళ్లల్లోకి చేరడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. **- గఫార్, స్థానికుడు**

పోలీసులు స్పందించాలి



ఈ ప్రాంతంలో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆఫీసుల నుంచి వచ్చే వారు ట్రాఫిక్ కారణంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే ఆటోలు ట్రాఫిక్‌లో ఇరుకుంటున్నాయి. దీని గురించి పోలీసులకు వివరించిన ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ద్విచక్రవాహనాల్ని సెల్లార్లల్లో నిలుపుదల చేసే విధంగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి. **-అప్పారావు, స్థానికుడు**

అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసినవారిని శిక్షించాలి



నిరసన తెలుపుతున్న హిందూ సంఘాలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ దేవస్థానంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని శిక్షించాలని గ్లోబల్ హిందూ హెరిటేజ్, హిందూ సంఘాలు, భాజపా కార్యకర్తలు ఆదివారం రాత్రి శంకర్‌విలాస్ కూడలి నుంచి వివేకానంద విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు యశ్వంత్, బ్రహ్మారెడ్డి, హర్ష, రాజేష్, సాయి, ప్రవీణ్, లక్ష్మీ పాల్గొన్నారు.

అడ్డంగా ఉన్నా.. అధికారులకు పట్టదా?


పొన్నూరురోడ్డు బీఆర్‌స్టేడియం మలుపు వద్ద రోడ్డు మధ్యలో బాక్స్

నగరపాలకసంస్థ(గుంటూరు): తూర్పు నియోజకవర్గంలో పలు ప్రధాన రహదారి కూడళ్లలో అనధికారికంగా ట్రాఫిక్‌కు అడ్డంగా ఐరన్ బాక్స్‌లు ఏర్పాటు చేసినా పట్టణ ప్రణాళికాధికారులు పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసులు సేదదీరేందుకు నగరంలో పలుకూడళ్లలో గతంలో ఐరన్ బాక్స్‌లు ఏర్పాటు చేశారు. ఈబాక్స్‌లు 30 చోట్ల ఏర్పాటుకు ఓ ప్రైవేటు ఏజన్సీకి జీఎంసీ ప్రణాళికావిభాగం అనుమతులు ఇచ్చారు. ఈబాక్స్‌లపై ప్రకటనలు వేసినందుకు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కానీ వీటికి అదనంగా ఇటీవల తూర్పు నియోజకవర్గం పరిధిలో పది ఐరన్ బాక్స్‌లను ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేశారు. అనధికారికంగా వీటిని ఏర్పాటు చేయడంతో పాటు ప్రకటనలు ఏర్పాటు చేసేందుకు ఫ్రేంలు బిగించారు. ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న ఈబాక్స్‌లను అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఉచిత శిక్షణ


మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

నగరపాలకసంస్థ(గుంటూరు): మానవతా సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కోసం ఇవ్వనున్న ఉచిత శిక్షణ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. భాష్యం ఆడిటోరియంలో ఆదివారం ఎన్‌ఎంఎంఎస్ ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. ఎన్నారై అవ్వారి ప్రకాష్, రిలయన్స్ మేనేజరు ఈదర చంద్రశేఖర్, మానవతా సంస్థ ఛైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షులు కేసర్, కార్యదర్శి సతీష్‌బాబు, ప్రత్యూష సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ కార్యవర్గం ఎన్నిక


మాట్లాడుతున్న మాల్యాద్రి, వేదికపై అరుణ్‌కుమార్, చైతన్య, నాసర్‌జీ

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నగర అధ్యక్ష, కార్యదర్శులుగా జి. సాయి, బి.యశ్వంత్‌లు ఎన్నికయ్యారు. కొత్తపేటలోని కార్యాలయంలో ఆదివారం నగర మహా సభ నిర్వహించారు. అతిథులుగా సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి, అరుణ్‌కుమార్, చైతన్య, నాసర్‌జీ మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం విద్యార్థుల పోరాటాలవల్లే జరుగుతుందన్నారు. ఈసందర్భంగా నగర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బన్నీ, సాగర్, సహాయ కార్యదర్శులుగా సతీష్, వెంకటేష్, కోశాధికారిగా అజయ్, కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆర్ఎసిపిసి, గుంటూరు, 26-1-52, కన్నావారితోట, గుంటూరు-522004

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ జి. రాజు, చీఫ్ మేనేజర్, మొబైల్ నెం.9866517989;
ఆస్తి తనిఖీ కొరకు : 96032 88555.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తులను **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా** దిగువ సంతకందారు వ.నెం.1 ను తేది.25.06.2024న మరియు వ.నెం.2ను తేది.25.06.2024న స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఇ-వేలం (**SARFAESI** చట్టం 2002 క్రింద) **"ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే"** మరియు **"అక్కడ ఏమున్నదో అదే"** పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

1) ఋణగ్రహీత: శ్రీమతి తిరుపతి నాగమణి, భర్త : సింగారావు, ఫ్లాట్ నెం.502, సాయితేజ ఎవెన్యూ, సీతారామ్ టౌన్‌షిప్, నల్లపాడు రోడ్డు, గుంటూరు – 522005. **వేరొక చిరునామా:** ఫ్లాట్ నెం.102, అఖిల్ ఆర్కేడ్, సుభాని హోటల్ దగ్గర, జి.టి. రోడ్డు, శ్రీనివాసరావుపేట, గుంటూరు – 522004. **డిమాండ్ నోటీసు తేది: 22-04-2024**

బకాయి మొత్తం: తేది.22-04-2024 నాటికి **రూ.33,47,776/-** (డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత ఏవైనా చెల్లింపులు ఉన్నచో మినహాయించబడును) + కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి.

షెడ్యూల్ ఆస్తి వివరములు :

శ్రీమతి తిరుపతి నాగమణి, భర్త: సింగారావు గారికి చెందిన ఆస్తి: షెడ్యూల్-ఎ: గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్- డిస్ట్రిక్ట్, నల్లపాడు గ్రామ పంచాయితీ, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలో, నల్లపాడు డి.నెం.404 లోని ఎ.7.94 సెంట్లు దీనిలో, ఎ.3.97 సెంట్లు దీనిలో, వి.జి.టి.ఎమ్. ఉడా ఎల్‌పి. నెం.01/2011 ప్రకారం సీతారామ్ టౌన్‌షిప్ లోని ప్లాట్ నెం.2 విస్తీర్ణం 894 చ॥గ॥లు స్థలం మరియు అందు నిర్మించిన "సాయి తేజ ఎవెన్యూ" అను పేరున గల అపార్ట్‌మెంట్‌కు **హద్దులు (సమీప డోర్ నెం.4-347/బి) : తూర్పు :** ప్లాట్ నెం.లు 7,6,5 – 77'9"', **దక్షిణం :** ఓపెన్ స్పేస్ – 103'6"', **పడమర :** 40 అ॥ల వెడల్పు రోడ్డు – 77'9", **ఉత్తరం :** 40 అ॥ల వెడల్పు రోడ్డు – 103'6".

ఈ హద్దుల మధ్య 894 చ॥గ॥లు లేదా 747.50 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం, దీనిలో

షెడ్యూల్-బి: పైన తెలిపిన షెడ్యూల్-ఎ ఆస్తిలోని 52.40 చ॥గ॥లు లేదా 43.81 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు **"సాయి తేజ ఎవెన్యూ"**, స్టిల్ట్, క్రింది, మొదటి, రెండు మరియు మూడు అంతస్తుల పైన గల నాల్గవ అంతస్తు నందు1415 చ॥అ॥లు ప్లింత్ ఏరియాతో (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియాతో సహా) పైన తెలిపిన వాటా స్థలం స్టిల్ట్ ఫ్లోర్ నందు ఒక కార్ పార్కింగ్ సౌకర్యంతో, అన్ని ఎమినిటీస్ మరియు కామన్ మరియు ఉమ్మడి హక్కులు, ఈజిమెంట్స్ హక్కులు, సదుపాయాలతో గల నివాస ఫ్లాట్ నెం.502. **హద్దులు: తూర్పు:** కామన్ కారిడార్, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై **(సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.7896/2018, తేది.20-11-2018 ప్రకారం)**

రిజర్వు ధర : రూ.28,44,100/-	ధరావత్తు : రూ.2,84,410/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ-వేలం తేదీ : 22-11-2024	సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ వరకు	

2) ఋణగ్రహీతలు: శ్రీమతి మన్నెన సూర్యకళ, భర్త : మన్నెన కోటేశ్వరరావు మరియు **శ్రీ మన్నెన కోటేశ్వరరావు,** తండ్రి : సూర్యనారాయణ, ఫ్లాట్ నెం.104, మైత్రి హోమ్స్, St.Ann's డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ రోడ్డు ఎదురుగా, హోసన్నా మందిర్ దగ్గర, గోరంట్ల, గుంటూరు – 522034. **వేరొక చిరునామా:** డోర్ నెం.9-39/8ఎ, శివాలయం వీధి, రైస్ మిల్ దగ్గర, యర్రబాలెం, గుంటూరు జిల్లా – 522503.

డిమాండ్ నోటీసు తేది: 08-04-2024 **బకాయి మొత్తం: తేది.08-04-2024** నాటికి **రూ.35,27,081/-** (డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత ఏవైనా చెల్లింపు ఉన్నచో మినహాయించబడును) + కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి.

షెడ్యూల్ ఆస్తి వివరములు :

శ్రీమతి మన్నెన సూర్యకళ, భర్త: మన్నెన కోటేశ్వరరావు గారికి చెందిన ఆస్తి: షెడ్యూల్-ఎ: గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్- డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలో, గోరంట్ల డి.నెం.465/1 లోని ఎ.10.32 సెంట్లు దీనిలో, ఎ.1.05 సెంట్లు భూమి దీనిలో, ప్లాట్ నెం.1 విస్తీర్ణం 723 చ॥గ॥లు స్థలం (మొత్తం విస్తీర్ణం 754 చ॥గ॥లలో రోడ్డు వెడల్పు కోసం వదిలిపెట్టిన తరువాత) మరియు అందు నిర్మించిన "మైత్రి హోమ్స్" అను పేరున గల అపార్ట్‌మెంట్‌కు **హద్దులు: తూర్పు :** మున్సిపల్ రోడ్డు – 113'2"', **దక్షిణం :** ఇతరులకు చెందిన ఆస్తి – 57'6"', **పడమర :** మురుకుపూడి వెంకటచార్యులు గారికి చెందిన భూమి కొంతమేర మరియు 33 అ॥ల వెడల్పు రోడ్డు విస్తీర్ణం కొంతమేర – 113'2", **ఉత్తరం :** మద్దిరాల శివ నాగ రాజేంద్రప్రసాద్ మొ॥ వారికి చెందిన ప్లాట్ నెం.2 – 57'6".

ఈ హద్దుల మధ్య 723 చ॥గ॥లు లేదా 604.50 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం, దీనిలో

షెడ్యూల్-బి: పైన తెలిపిన షెడ్యూల్-ఎ ఆస్తిలోని 39.58 చ॥గ॥లు లేదా 33.09 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు **"మైత్రి హోమ్స్"**, క్రింది అంతస్తు నందు 1024 చ॥అ॥లు ప్లింత్ ఏరియాతో (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియాతో సహా) పైన తెలిపిన వాటా స్థలం స్టిల్ట్ ఫ్లోర్ నందు ఒక కార్ పార్కింగ్ సౌకర్యంతో, అన్ని ఎమినిటీస్ మరియు కామన్ మరియు ఉమ్మడి హక్కులు, ఈజిమెంట్స్ హక్కులు, సదుపాయాలతో గల నివాస ఫ్లాట్ నెం.104. **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** కామన్ కారిడార్ మరియు ఫ్లాట్ నెం.103. **(సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3859/2019, తేది.05-09-2019 ప్రకారం)**

రిజర్వు ధర : రూ.26,89,536/-	ధరావత్తు : రూ.2,68,954/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ-వేలం తేదీ : 22-11-2024	సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ వరకు	

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:21-10-2024 నుండి 21-11-2024 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క వెబ్ సైట్ : **www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices**లో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ **M/s PSB Alliance** ఇ-వేలం పోర్టల్ : **https://ebkray.in/eauction-psb/bidder-registration & https://www.ebkray.in** & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: **91 - 8291220220, Mail ID : support.ebkray@psballiance.com**ను సంప్రదించండి.

2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.

తేది: 19-10-2024, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రజాఫిర్యాదుల స్వీకరణ నేడు

నగరపాలకసంస్థ: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

దిల్లీ సదస్సుకు కమిషనర్

నగరపాలకసంస్థ (గుంటూరు): అర్బన్ ల్యాండ్ రికార్డు కోసం సర్వే, రీ సర్వేలో ఆధునిక సాంకేతిక విధానాల అమలుపై ఈనెల 21, 22 తేదీల్లో న్యూదిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు నగర కమిషనర్ శ్రీనివాసులు హాజరుకానున్నారు.

జీజీహెచ్ ఆహార సరఫరా వ్యక్తులపై దాడి

నగరంపాలెం(గుంటూరు), న్యూస్‌టుడే: జీజీహెచ్‌లో డైట్ సెక్షన్ నిర్వహిస్తున్న యువకులపై పూర్వ ఉద్యోగి అకారణంగా ఆదివారం 11గంటలకు దాడి చేశాడు. డైట్ సెక్షన్‌లో ఉన్న యువకులను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. సీసీ కెమెరాలు ఉన్నా దాడి చేయడం ఆస్పత్రి వర్గాలను కలవరపెడుతోంది. జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా సోమవారం కమిటీ వేసి పరిశీలిస్తామని తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం


రవీంద్ర (పాత చిత్రం)

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని సంగం జాగర్లమూడి వద్ద కాలువలో శనివారం ఈతకు దిగి గల్లంతైన గుంటూరుకు చెందిన బీటెక్ విద్యార్థి జి.రవీంద్ర(19) మృతదేహం ఆదివారం కాకుమాను మండలంలో లభించిందని తెనాలి గ్రామీణ పోలీసులు ఆదివారం తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి అంకమ్మ కుమారుడి మృతదేహాన్ని చూసి గుండలవిసేలా రోదించారు. కుటుంబ సభ్యుల ఆవేదన చూపురుల కంట తడి పెట్టించింది.